నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది
నిండువస్త్రములును నిండుగా కనిపించ
దండమెట్టుచుండు ధరణి జనులు
విప్పితిరుగగాను విస్మయముగ జూచి
చిత్రములను దీయు సెల్లులందు
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 53 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | ఆగస్టు 21, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

- హజరైన ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు



**మహాబలిపురం,ఆగస్టు 20 :** హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం మహాబలిపురంలో జరిగింది. ఈ సమావేశంకు ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు

మిగతా2లో...

## సమస్యల పరిష్కారమే అసలైన
# సమాఖ్యవాదం

- దక్షిణాది అభివృద్ధి చెందితేనే.. దేశాభివృద్ధి పరుగులు
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు చేయూత
- పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మహాబలిపురం,ఆగస్టు 20 :** కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా ఆంధ్రప్రదేశ్

మిగతా2లో...



## తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

- నిషేధిత జాబితాకు పొంగులేటిదే బాధ్యత
- బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 :** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు.

మిగతా2లో...

## రాజీవ్ జయంతి సందర్భంగా
# కాంగ్రెస్ నివాళి

వీర్‌భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం

ఎక్స్ వేదికగా రాజీవ్‌ను స్మరించుకున్న ప్రధాని మోడీ


2లో

## ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం

డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా కార్యక్రమం

కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయాను మంత్రి వాకిటి శ్రీహరి ఆహ్వానం


2లో

## 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు
# పరిష్కారం..

కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమే లక్ష్యం

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు

అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం



**హైదరాబాద్,ఆగస్టు 20 :** 22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి గారు స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్,

మిగతా2లో...



## పాలిటెక్నిక్‌ల విలీనంపై
# అపోహలు తగవు

నైపుణ్య శిక్షణ అందించాలన్నదే ప్రభుత్వ ఆలోచన

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్,ఆగస్టు 20 :** ఇటీవల స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్‌ల విలీనంపై నెలకొన్న అపోహలకు మంత్రి వివేక్ వెంకటస్వామి తెరదించారు. స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనంపై కొందరు అపోహలు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. పాలిటెక్నిక్‌లను మరింత అప్‌గ్రేడ్ చేసి, విద్యార్థులకు మెరుగైన నైపుణ్య శిక్షణ అందించాలనే ఉద్దేశంతోనే వాటిని స్కిల్ యూనివర్సిటీ

మిగతా2లో...

## అర్ధరాత్రి బావిలోకి
# దూసుకెళ్లిన కారు

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి



**సిద్దిపేట,ఆగస్టు 20 :** సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈవిషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బాక మండలంలోని బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి తమ స్వగ్రామానికి కారులో వస్తుండగా బుధవారం అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి బావిలో పడిపోయారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో బావిలో నుంచి కారును, నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందడంతో బలవంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

## తెలంగాణలో 22ఎ సెక్షన్
# దుర్వినియోగం

**హైదరాబాద్,ఆగస్టు 20 :** తెలంగాణలో 22ఎ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఊఓఆం అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22ం జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల దందా సాగుతుంది. నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు 30? కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

మిగతా2లో...

రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ



## సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

అందుకు తనను బాధ్యులు చేయడం తగదు
క్రమశిక్షణ లేఖను ఉపసంహరించుకో
వాలన్న కొండా సురేఖ


2లో

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీషన్, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్ధవంతంగా సమన్వయం చేయగల సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని ఆయన చెప్పుకొచ్చారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సీఎం చెప్పారు.సమస్యలు రాష్ట్ర సరిహద్దుల ను ప్రభుత్వ÷ళ్లై కంటే వేగంగా దాటుతాయి భట్టి చమత్కరించారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను తెలంగాణ కచ్చితంగా కోరుకుంటోందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ,ఆంధప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్?ఎఎ పరిధిలో ఉందని ఆయన గుర్తు చేశారు. చట్టపరమైన పక్రియ ద్వారా త్వరగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన చెప్పారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఈ సమస్యలకు తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడం కాదని, ప్రతి కొన్ని సంవత్సరాలకు కొత్త అర్థాలు, వివరణలు ఇవ్వడం కూడా కాదని ఆయన వ్యాఖ్యానించారు. పెండింగ్ అంశాలు ఇకపై తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలని తెలంగాణ కోరుకుంటోందని అన్నారు. షెడ్యూల్ లోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. ఆంధప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం?2014కు సంబంధించి సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపింది. సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరుకుంటున్నప్పటికీ, అది తప్పనిసరిగా చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే ఉండాలని స్పష్టంగా చెప్పారు. షెడ్యూల్?చీ సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజనను ఆంధప్రదేశ్ కోరుతోందని, అయితే పునర్వ్యవస్థీకరణ చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారం లేవని ఆయన చెప్పారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతు లేదని తెలిపారు. ఈ అంశం ఆంధప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన పక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని కోరారు.

## 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం..

(మొదటి పేజీ తరువాయి)

వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ÷ాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా? భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 2ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమ వుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి' అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

## తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 ం భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు. ధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు.

## ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 :** తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ వీసీ / ఎండీ సోనిబాలాదేవి న్యూఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువ క్రీడాకారులకు జాతీయ స్థాయిలో మెరుగైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి తెలంగాణను దేశ క్రీడా పటంలో మరింత బలమైన రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ల్గ÷లో ఇండియా కార్యక్రమ నిర్వహణ కోసం తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను మంత్రి వాకిటి శ్రీహరి కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణలో 22ఎ సెక్షన్ దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

22ంపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దీనిపై వెంటనే స్వతంత్ర విచారణకు రేవంత్ ప్రభుత్వం ఆదేశించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు అని లేఖలో పేర్కొన్నారు.

సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

## సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

**హైదరాబాద్,ఆగస్టు 20 :** తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గురువారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఆమె లేఖ రాశారు. ఈ సందర్భంగా తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ఆ లేఖలో మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తన కుమార్తె అయినంత మాత్రాన.. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని స్పష్టం చేశారు. సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని కమిటీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా క్రమశిక్షణా కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుస్మిత మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతానని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో సుస్మితా పటేల్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్.. ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని పీసీసీని కోరింది. అలాగే క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి కూడా స్పందించారు. దీనిపై మంత్రి కొండా సురేఖను వివరణ కోరతామని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు.

## రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 :** భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది.ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించబడుతుందని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించు కున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ జరుపుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యు వతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం.. ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా భారతీయ యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాకుండా, భిన్నత్వంలో ఏకత్వం అనే భారతదేశ సంప్రదాయా లు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు. కాగా, ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984వ సంవత్సరంలో భారతదేశానికి 40 ఏళ్ల వయసులో రాజీవ్ గాంధీ 6వ ప్రధానమంత్రి అయ్యారు.

## హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. సమావేశంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి ్ సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సీఎం సూచించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాల ని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించడంతోపాటు దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదించిన చేసారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరిన ముఖ్యమంత్రి దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందన్నారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ప్రసంగంలో పేర్కొన్న సీఎం, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థలు 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదనీ వెల్లడించారు. కావేరి నదుల అనుసంధా నంతో 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదన చేసిన సీఎం, గోదావరి, కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వ్యాఖ్యానించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. గంగా, కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరం అన్న చంద్రబాబు, నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలన్నా రు. సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని కొనియాడిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్ తో మాట్లాడారని పేర్కొన్నారు. విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారని ప్రశంసించారు కర్ణాటక సీఎం డీకే శివకుమార్.

## పాలిటెక్నిక్‌ల విలీనంపై అపోహలు తగవు

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. బ్లూ కాలర్ ఉద్యోగాల్లోనూ తెలంగాణ యువత ముందుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలిటెక్నిక్ కాలేజీల లెక్చరర్లు, సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగుతారని, వారి సర్వీసు భద్రతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. డిప్యూటేషన్, బదిలీల విధానంలోనూ ఎలాంటి మార్పులు ఉండవని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసినప్పటికీ పాలిటెక్నిక్ ఫీజుల్లో ఎలాంటి మార్పు ఉండదని, విద్యార్థులు ఈసెట్ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ పొందే విధానం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే పాలిసెట్‌ను కూడా కొనసాగిస్తామని తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థు లు, లెక్చరర్లకు విలీనంతో మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్థులకు రూ.2 వేల స్టైఫండ్ అందించే అంశంపై కూడా కసరత్తు చేస్తున్నామని చెప్పారు. వరంగల్‌లో విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించిన సీఐపై చర్యలు తీసుకుని బదిలీ చేశామని తెలిపారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలిటెక్నిక్ కాలేజీలను పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థుల ఆందోళనల వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందని ఆరోపించిన మంత్రి.. రాజకీయ పార్టీల తప్పుడు ప్రచారాన్ని విద్యార్థులు, ఉద్యోగులు నమ్మవద్దని సూచించారు. శక్తి శాఖ పేరును కార్మిక శాఖగా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు వస్తున్నాయని, శాఖ పేరులో 'కార్మిక' పదం కూడా ఉండేలా మార్పులు చేసే ఆలోచన ఉందని వెల్లడించారు.

## భద్రాచలం ఐదు గ్రామాలు తెలంగాణలో కలపాలి: మంత్రి తుమ్మల

**హైదరాబాద్,ఆగస్టు 20 :**రాష్ట్ర విభజన అనంతరం పెండింగ్‌లో ఉన్న తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలను కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నించింది.

గురువారం మహాబలిపురంలో కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాలుగు ప్రధాన అంశాలపై కేంద్రం, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని, పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత పునరుద్ధరణకు ఏపి వాటా నిధులు విడుదల చేయాలని, ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని, భద్రాచలం, ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్రాన్ని కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచలం పరిసరాల్లోని యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని తుమ్మల కోరారు.

ఈ ఐదు పంచాయతీల పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా, వాటి మొత్తం భౌగోళిక విస్తీర్ణం 11,122.01 ఎకరాలు అన్నారు. 2024 జూలై 18న భారీ వర్షాలకు దెబ్బతిన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెద్దవాగు ప్రాజెక్టును శాశ్వతంగా పునరుద్ధరించేందుకు రూ.92.20 కోట్లు అవసరమని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 16 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, మొత్తం ఆయకట్టులో 85.25 శాతం(13,640 ఎకరాలు) ఏపి పరిధిలోనే ఉందన్నారు.శాశ్వత పునరుద్ధరణ వ్యయాన్ని ఆయకట్టు నిష్పత్తి ప్రకారం రెండు రాష్ట్రాలు భరించాలని, ఏపీ తన వాటా నిధులను వెంటనే విడుదల చేయాలని చంద్రబాబును కోరారు. గత ఫిబ్రవరిలోనే విజ్ఞప్తి చేసినప్పటికీ నిర్ణయం పెండింగ్‌లో ఉందని, రైతుల ప్రయోజనాల

# బొడ్డుని కుంటలో జలకళ



**ఖానాపూర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ పట్టణ శాంతినగర్ శివారులోని బొడ్డుని కుంటలో ఇటీవల కురిసిన వర్షాలతో నీరు నిండిపోవడంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. జూన్‌లో కుంట అభివృద్ధి పనులకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ జి. నగేష్, ఎమ్మెల్యే వేడుమ బొజ్జు పటేల్ శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ఇంకా పూర్తికాలేదు. రాతి కట్టడం కొనసాగుతుండగా, కుంట చుట్టూ రోడ్డు వేసి విద్యుత్ లైట్లు అమర్చితే మినీ ట్యాంక్‌బండ్‌గా మారుతుందని ప్రజలు అభి ప్రాయ పడ్డారు. సాయంత్రం వేళల్లో కుటుంబ సమేతంగా విహరించేందుకు, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేస్తే మరింత ఆకర్షణీయంగా మారుతుందని స్థానికులు కోరుతున్నారు. నీరు నిండిన కుంట ప్రశాంత వాతావరణాన్ని కలిగిస్తోందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. అయితే పరిశుభ్రత కోసం ప్లాస్టిక్ వాడకూడదని, మరుగుదొడ్లను కుంటలో వదల కూ డదని బోర్డులు పెట్టినప్పటికీ, పరిశుభ్రత కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజలు గుర్తుచేశారు.

# ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**హుస్నాబాద్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సకల కళల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వలస సుభాష్ చంద్రబోస్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆగస్టు 22న సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో జిల్లా స్థాయి కళాకారుల సదస్సు, సీనియర్ కళాకారుల సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీకి ఘన నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సభ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో అత్యధిక జానపద కళారూపాలు ఉన్నప్పటికీ, ప్రత్యేక జానపద అకాడమీ, విశ్వవిద్యాలయం ఏర్పాటు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతరించిపోతున్న జానపద



కళలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో సీనియర్ కళాకారులు వేముల వీరస్వామి, వలోజు జగదీశ్వర్, ఎర్రం రాజు, దేవరాజు, బత్తుల చంద్రమౌళి, ముక్కెర సంపత్, తాడూరు సురేష్, కె. లక్ష్మణ్, జి. అర్చన గౌడ్, గర్రెపల్లి అనిల్, పొన్నాల వినోద్, పిడిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామ యువకుల చేయూత



**ఖానాపూర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండలంలోని బావాపూర్ (ఆర్) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామ యువకులు సేవాభావంతో సహాయం అందించారు. బాస వినీత్ రూ.5 వేల విలువైన స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందించగా, కర్ణవత్తుల గంగాధర్ రూ.1,500 విలువైన సాక్స్ అందజేశారు. సర్పంచ్ మంగమ్మ రాజేశ్వర్ చేతుల మీదుగా విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. విద్యార్థుల అవసరాలకు స్పందించిన యువకులను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాష మంగమ్మ, ప్రధానోపాధ్యాయులు సులోచన, ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహణ

**హుస్నాబాద్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వాతావరణ మార్పులు, ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించేందుకు రైతు వేదికలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి కొండల్ రెడ్డి మాట్లాడుతూ నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమయ్యే వరి సాగును తగ్గించి ఆయిల్‌పామ్, కందులు, మినుములు, సజ్జ, రాగి, ఆముదం, పొద్దుతిరుగుడు, వేరుశనగ, కూరగాయల వంటి పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. మండల వ్యవసాయ



అధికారి వేల్పుల పూజ మాట్లాడుతూ ఆరుతడి పంటల సాగును పెంచాలని, ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందుతున్నందున దీర్ఘకాలికంగా లాభదాయకమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి. సురేష్, మునిసిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ జంగాపల్లి ఐలయ్య, మాజీ గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు. రైతులు నీటి వనరులను సంరక్షించుకోవడంతో పాటు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

# రోడ్లకు అభివృద్ధికి నిధులున్నా నత్తనడకన నిర్మాణ పనులు



**ఖానాపూర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నిర్మల్ జిల్లా ప్రధాన రహదారుల అభివృద్ధికి హం పథకం ద్వారా రూ.75.26 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో దిలావర్పూర్, నచ్చినలాపూర్, బెల్లాల్, ఖానాపూర్, తర్లపాడు రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖానాపూర్ మండలంలోని దిలావర్పూర్, గోసంపల్లి, లింగాపూర్, ఎలగడప, బెల్లాల్ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. తర్లపాడు, దిలావర్పూర్ వద్ద రింకూని వాగుపై బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న రహదారి పనులు త్వరగా పూర్తి చేసి, మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని సీపీఎం ధర్నా

**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని, ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ యువత శక్తిని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. దేశంలో, రాష్ట్రంలో లక్షలాది మంది విద్యావంతులైన యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకపోవడం నిర్లక్ష్యమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువతను మోసం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేసి, పోలీస్




శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుద్యోగ యువతకు నెలకు రూ.5,000 నిరుద్యోగ భృతి అందించాలని, కొత్త పరిశ్రమలు, ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం డిఆర్ఓ స్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, జి. బీమా సాహెబ్, ఉప్పునూటి శ్రీనివాస్, సుంకర సంపత్, ఎడ్ల రమేష్, వెల్మారెడ్డి రాజిరెడ్డి, జి. రాజేశం, డి. నరేష్ పటేల్, కొప్పుల శంకర్, కోనేటి నాగమణి, తిప్పారపు సురేష్, రాయికంటి శ్రీనివాస్, జి. సూర్య, మాతంగి శంకర్, గుండేటి వాసుదేవ్, పిల్లి రవి, ప్రభాకర్, బాసర సంపత్ రావు, సిహెచ్. రాములు, రాజ్‌కుమార్, శివ, అరవింద్, దండిగారి సతీష్, వద్లూరి కిషోర్, బోగేష్, పిట్టల తిరుపతి, ఏ. అశోక్, పి. శ్రీకాంత్, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఊర్లల్ల, పట్నాల్ల మాటలు ముచ్చట్లు పుస్తక ఆవిష్కరణ



**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సమైక్య సాహితి ఆధ్వర్యంలో సంపత్ కుమార్ రచించిన "తెలంగాణ ఊర్లల్ల, పట్నాల్ల మాటలు ముచ్చట్లు" పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం రేపు (21.08.26) సాయంత్రం 5.30 గంటలకు జిల్లా పరిషత్ క్వార్టర్స్‌లోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు హాజరవుతారని, మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్ రెడ్డి పుస్తక ఆవిష్కరణ చేస్తారని నిర్వాహకులు తెలిపారు. విశిష్ట అతిథులుగా డా. నలిమెల భాస్కర్ (బహుభాషా వేత్త), పెండ్యాల కేశవ రెడ్డి (రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు) పాల్గొననున్నారు. అదనంగా జర్నలిస్ట్ కట్టా నరేంద్ర చారి, పుస్తక సౌజన్య ప్రదాత పులి దేవేందర్ రెడ్డి, ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా గట్టేపల్లికి చెందిన యక్షగాన కళాకారుడు దురిశెట్టి రాములను సత్కరించనున్నారు. సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

# మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం

**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కరీంనగర్‌లో కామర్స్ విభాగాధిపతి మరియు మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త డా. బి. రజని దేవి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం, బాధ్యతాయుతమైన ఆర్థిక అలవాట్లు పెంపొందించుకోవడం, ఆధునిక ఆర్థిక వ్యవస్థలోని అవకాశాలు, ప్రమాదాలను అర్థం చేసుకోవడం కోసం ఆర్థిక అక్షరాస్యత ఎంతో అవసరమని తెలిపారు. బ్యాంకింగ్, పెట్టుబడులు, డిజిటల్ ఫైనాన్స్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. మూడు సెషన్లుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా




విద్యార్థులు, 35 మంది ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. వనరుల వ్యక్తిగా శ్రీనివాస్ కొసూరి, బిఎఫ్ఎస్ఐ ట్రైనర్, కంపెనీ సెక్రటరీ, మాజీ ఎస్బిఐ బ్యాంకర్ పాల్గొని ఆర్థిక అక్షరాస్యత, పెట్టుబడిదారుల అవగాహన, క్యాపిటల్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్, బ్యాంకింగ్ ఉత్పత్తులు, డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ సెక్యూరిటీ, కెరీర్ అవకాశాలపై ప్రాక్టికల్ ఉదాహరణలు, కేస్ స్టడీలు, చర్చలు, గ్రూప్ యాక్టివిటీస్, క్విజ్‌ల ద్వారా అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. డి. వరలక్ష్మి ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ విద్యార్థులు, ఫ్యాకల్టీ ఆర్థిక అవగాహన పెంపొందించుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన డా. బి. రజని దేవిని అభినందిస్తూ, పొందిన జ్ఞానాన్ని విద్యార్థులు తమ విద్యా, వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో వినియోగించుకోవాలని ప్రోత్సహించారు.

# నేరం చేస్తే శిక్ష తప్పదు- సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరస్థులకు త్వరితగతిన న్యాయ స్థానాల ద్వారా కఠిన శిక్షలు పడేలా చేయడంలో కరీంనగర్ పోలీస్ కోర్టు విభాగం విశేష ప్రతిభ కనబరిచింది. ఈ సంవత్సరం ఇప్పటివరకు 17 ప్రధాన కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు ఖరారయ్యాయి. ముగ్గురు హంతకులకు యావజ్జీవ కారాగార శిక్షలు, గంజాయి అక్రమ రవాణా, పోక్సో, హత్యాయత్నం కేసుల్లో భారీ జైలు శిక్షలు విధించబడ్డాయి. పకడ్బందీ దర్యాప్తు, తిరుగులేని సాక్ష్యాధారాల సమర్పణతో కోర్టులు నిందితులకు కఠిన జైలు శిక్షలు, జరిమానాలు విధించాయి. జిల్లా క్రైమ్ రివ్యూ సమావేశంలో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన కోర్టు డ్యూటీ అధికారులు, పబ్లిక్




ప్రాసిక్యూటర్లను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. హత్య కేసుల్లో యావజ్జీవ శిక్షలు, కల్పబుల్ హోమిసైడ్ కేసుల్లో 10 సంవత్సరాల వరకు కఠిన జైలు శిక్షలు, గంజాయి కేసుల్లో 5 సంవత్సరాల జైలు శిక్షలు, పోక్సో కేసులో 2 సంవత్సరాల శిక్ష, రోడ్డు ప్రమాదాలు, దాడులు, దొంగతనం, చీటింగ్ కేసుల్లో 2 సంవత్సరాల వరకు జైలు శిక్షలు విధించబడ్డాయి. సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేకూర్చడం, నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా చేయడమే పోలీసు శాఖ ప్రధాన కర్తవ్యం అని స్పష్టం చేశారు. విచారణ అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని, ఇదే నిబద్ధతతో రానున్న రోజుల్లోనూ నేరస్థులకు చట్టపరంగా గుణపాఠం చెబుతామని తెలిపారు. నేరాలకు పాల్పడితే ఎవరూ తప్పించుకోలేరని, బాధితుల పక్షాన నిలిచి న్యాయం సాధించడంలో ప్రతి ఒక్కరి కృషి ప్రశంసనీయం అని ఆయన పేర్కొన్నారు.

# జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో అద్వైత విద్యార్థిని సుభిక్షకు స్వర్ణ పతకం



**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అద్వైత ఇంటర్నేషనల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని సుభిక్ష జిల్లా అథ్లెటిక్స్ మీట్‌లో అండర్-14 విభాగం ట్రయథ్లాన్ శిసిరిలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. తన క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించిన సుభిక్ష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. డైరెక్టర్ అనుదీప్ సౌగాని ఆమె కృషి, అంకితభావాన్ని ప్రశంసిస్తూ రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, కోచ్ సహకారం సుభిక్ష విజయానికి దోహదమైందని పాఠశాల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ విజయం అద్వైత విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

# యువత భాగస్వామ్యమే రాజీవ్ గాంధీకి నిజమైన నివాళి

**కరీంనగర్/హుస్నాబాద్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు కరీంనగర్, హుస్నాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కరీంనగర్ రాజీవ్ చౌక్‌లో డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువతకు ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం పెంచిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని నాయకులు కొనియాడారు. ఐటీ, టెలికమ్యూనికేషన్ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు పునాదులు వేసి, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ యువతకు మరింత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, 21 ఏళ్లు నిండిన యువత ఎంపీ, ఎమ్మెల్యే పదవులకు పోటీ చేసే అవకాశం కల్పించే బిల్లును



ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. మేడిపల్లి సత్యం యువతను ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కూడా కాంగ్రెస్ నాయకులు రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు నేటి తరానికి



స్ఫూర్తిదాయకమని, దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లే లక్ష్యంతో సాంకేతిక రంగంలో సంస్క రణలు చేసిన మహనీయుడని వారు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ చూపిన మార్గంలో యువతను ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేయడం, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు.

# ఘనంగా బీజేపీ సీనియర్ నాయకుని జన్మదిన వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీజేపీ సీనియర్ నాయకుడు వంగల రవి గోపాల్ జన్మదిన వేడుకలు జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ (బాలు) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ కన్వీనర్ జాడి బాలారెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, దయ్యాల మల్లేశం, దయ్యాల అశోక్ కుమార్, కాసం సంతోష్, చంద్రగిరి వేణు, ఖర్చు మధు, సృజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి ఎస్ఎఫ్ఐ

పెద్దపల్లి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాలిటెక్నిక్ విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా నాయకులు ఆర్ల సందీప్, ప్రశాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ దిశగా నెట్టే విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సాంకేతిక విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దానిని ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లడం ప్రమాదకరమని వారు పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో విలీనం లేదా పీపీపీ విధానంలో ప్రైవేటు సంస్థల ఆధీనంలోకి తీసుకెళ్లే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.




పాలిటెక్నిక్ విద్యార్థుల ఉన్నత విద్యా అవకాశాలు, లాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజనీరింగ్‌లో ప్రవేశం, అకడమిక్ ప్రమాణాలు, భవిష్యత్ విధానాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వారు కోరారు. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (సాంకేతిక విద్యా మండలి)ను కొనసాగిస్తూ మరింత బలోపేతం చేయాలని, అధ్యాపకుల కొరతను తీర్చాలని, ఆధునిక ప్రయోగశాలలు, వర్క్‌షాప్‌లు, హాస్టళ్లు, పరికరాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఫీజుల భారం పెంచకూడదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు పూర్తిగా విడుదల చేయాలని వారు కోరారు. జాతీయ విద్యా విధానం--2020ను అమలు చేయబోమని చెబుతూ మరో మార్గంలో అదే విధానాలను అమలు చేయడం తగదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, నవీన్, రోహిత్, అర్జున్, లోకేష్, మారుతి, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యం సీఎండీ

పెద్దపల్లి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పెద్దపల్లి సర్కిల్‌లో పర్యటించి ఓఅండ్ఎం సిబ్బందితో సమావేశమయ్యారు. విద్యుత్ సరఫరా, వినియోగదారుల సేవలు, భద్రతా చర్యలు, విద్యుత్ అంతరాయాల తగ్గింపు అంశాలపై సమీక్ష నిర్వహించారు.సీఎండీ మాట్లాడుతూ వినియోగదారులు--సిబ్బంది మధ్య సత్సంబంధాలు కొనసాగించాలని, సమస్యలను సానుకూల దృక్పథంతో స్వీకరించి వేగంగా పరిష్కరించడం ద్వారా సంస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని సూచించారు. విద్యుత్ రంగంలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని, మారుతున్న అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.విద్యుత్ ప్రమాదాల నివారణకు "ఒక నిమిషం నియమం" పాటించాలని, ఏ పని ప్రారంభించే ముందు



ఒక నిమిషం ఆలోచించి ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను గుర్తించి భద్రతా చర్యలు తీసుకోవాలని సీఎండీ స్పష్టం చేశారు. ఉద్యోగులు తమ భద్రతతో పాటు సహోద్యోగులు, వినియోగదారుల భద్రతకు బాధ్యత వహించాలని సూచించారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి 1912 టోల్‌ఫ్రీ సేవలను విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి వినియోగదారుడికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు ఫీల్డ్ స్థాయిలో ముందస్తు చర్యలు తీసుకోవాలని, లోపాలను వేగంగా గుర్తించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశం చారు. ఉద్యోగులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సీఎండీ సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు, భద్రతా ప్రమాణాల అమలు, సాంకేతిక అభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ గంగాధర్, డివిజనల్ ఇంజినీర్లు బాలయ్య, బ్రహ్మాచారి, ప్రభాకర్, ఎస్ఏఓ తిరుపతయ్యతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్య ఉద్యమమే మార్గం

పెద్దపల్లి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పడిన టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా సన్నాహక సమావేశం జరిగింది. జిల్లా చైర్మన్ బొంకూరి శంకర్, సెక్రటరీ జనరల్ తూము రవీందర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్య ఉద్యమమే మార్గమని నాయకులు స్పష్టం చేశారు.ప్రధానంగా పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏలు విడుదల, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, పెండింగ్ బిల్లుల చెల్లింపు, హెల్త్ కార్డుల అమలు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, జీఓ నంబర్ 25 సవరణ, జీఓ నంబర్ 190 అమలు వంటి అంశాలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఉద్యమ



కార్యాచరణలో భాగంగా ఆగస్టు 27న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నిరసనలు, సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ మహా ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు.జిల్లా కలెక్టర్‌కు ప్రాతినిధ్యం అందజేసి ఉద్యమ కార్యక్రమాలకు అనుమతులు, పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పరిపాలనా సహకారం కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని, ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడతామని నాయకులు తెలిపారు.ఈ సమావేశంలో టీఎన్జీఓ, పీఆర్టీయూ, ఎస్టీయూ, యూటీఎఫ్, డీటీఎఫ్, సీపీఎస్, టీఆర్టీఎఫ్, మెడికల్, కమర్షియల్ టాక్స్, వెటరినరీ, పంచాయత్ కార్యదర్శుల సంఘాలు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా షూలు పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా షూలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంగారం గ్రామ సర్పంచి రేకుల జ్యోతి రఘు, ఉప సర్పంచి మేడి అశోక్, ఎంఈఓ సిరిమల్ల మహేష్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ వెంకటేశం, పాఠశాల చైర్మన్ పెండ్లి స్వరూప, ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో పాటు మెరుగైన, నాణ్యమైన విద్య అందిస్తున్నారని, తల్లిదండ్రులు ఈ అవకాశాలను



సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ ఊషన్నపల్లి పాఠశాల కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యా ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు సాధిస్తోందని, జిల్లా ఛాంపియన్ స్కూల్ అవార్డు రెండుసార్లు లభించిందని గుర్తుచేశారు.గురుకుల, ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం విద్యార్థుల విజయానికి కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షాబుద్దీన్, మాజీ ఉపసర్పంచి గుడ్ల సంపత్, వార్డు సభ్యుడు చిక్కుల వంశీ, ఉపాధ్యాయులు అమృత, సురేష్‌కుమార్, మంద శ్రీవాణి, ఎడ్ల స్రవంతి, బండారి సరిత, ముసుకు మధుకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కాంగ్రెస్ సర్కార్



కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : శక్తి స్కీమ్, జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ముందు బీఆర్ఎస్‌వి జిల్లా అధ్యక్షుడు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన జరిగింది.ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీకి విలీనం చేయడం పేద, మధ్యతరగతి విద్యార్థులకు తీవ్ర నష్టమని ఆయన పేర్కొన్నారు. పీపీపీ విధానంలో ఈ వ్యవస్థను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల ఫీజుల భారం పెరిగి, విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పాలిటెక్నిక్ పూర్తయిన తర్వాత లెటరల్ ఎంట్రీ ద్వారా నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం ఉండేదని, కానీ ఈ విలీనం వల్ల ఆ అవకాశం కోల్పోతారని అన్నారు. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న విద్యార్థులపై సీఐ రఘుపతి రెడ్డి దుర్వ్యవహారం చేసిన ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వి నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, ఆరె రవి గౌడ్, యువజన అధ్యక్షుడు గంగాధర చందు, నారదాసు వసంత్ రావు, బండ వేణు యాదవ్, సోమిరెడ్డి నరేష్ రెడ్డి, వడ్లకొండ పర్శరాం, గంటల రేణుక, విక్రమ్, శనిగరం సతీష్, పెరుమాండ్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

దేవరకొండ, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా దేవరకొండ డీఎస్పీ కార్యాలయం, డిండి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కార్యాలయాల్లోని రికార్డులు, కేసుల దర్యాప్తు వివరాలు, పెండింగ్ కేసుల ఫైల్స్, క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రత్యేకంగా గ్రేవ్ కేసులు, ఎస్సీ--ఎస్టీ అట్రాసిటీ కేసులు వంటి ఫైల్స్‌ను సమీక్షించి, ప్రతి కేసులో దర్యాప్తు ఏ దశలో ఉందో, ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, నిందితుల అరెస్టులు, చార్జ్‌షీట్ దాఖలు వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు.హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, మహిళలు--చిన్నారులపై నేరాలు వంటి తీవ్ర స్వభావం గల కేసులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని త్వరితగతిన ఛేదించాలని సూచించారు. ప్రతి కేసులో సంఘటనా స్థలం నుంచి లభించే ఆధారాలను శాస్త్రీయంగా సేకరించి, కోర్టులో నేరం రుజువయ్యేలా పటిష్టమైన సాక్ష్యాధారాలను నమోదు చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు.పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే ప్రతి కేసుకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ,



సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆధునిక పద్ధతులతో దర్యాప్తు జరపాలని ఆయన సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సమస్యాత్మక ప్రాంతాలు, నేర ప్రభావిత ప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించి చట్టపరమైన పరిష్కారం చూపాలని, ప్రజలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు.ఈ వార్షిక తనిఖీలో దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, డిండి సీఐ బిసన్న, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 12వ రోజుకు చేరిన నారాయణపూర్ ముంపు గ్రామ పోరాటం



గంగాధర, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని నారాయణపూర్ గ్రామస్తుల రిలే నిరాహార దీక్ష 12వ రోజుకు చేరింది. మధురానగర్‌లో వినూత్నంగా బిక్షాటన చేస్తూ గ్రామ ప్రజలు నిరసన తెలిపారు. నారాయణపూర్‌ను పూర్తిస్థాయిలో ముంపు గ్రామంగా ప్రకటించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ప్రజలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, అక్రమ అరెస్టులను ఆపాలని గ్రామస్థులు కోరారు. న్యాయం కోసం పోరాటం కొనసాగుతుందని, అధిక సంఖ్యలో ప్రజలు దీక్షలో పాల్గొన్నారని తెలిపారు.

# శాతవాహన విశ్వవిద్యాలయంలో రెడ్ క్రాస్ సభ్యత్వ కార్యక్రమం నిర్వహణ



కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : శాతవాహన విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఉపకులపతి ఆచార్య యు. ఉమేశ్ కుమార్ ప్రారంభించారు.టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు సభ్యత్వం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజ శ్రేయస్సు కోసం విశ్వవిద్యాలయం రెడ్ క్రాస్ సొసైటీతో కలిసి పనిచేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 350 మంది సభ్యత్వం పొందారని, ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డా. ఇ. మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి డా. సురేష్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై. కిషోర్, ప్రోగ్రాం ఆఫీసర్ డా. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చైతన్య వెల్డింగ్ అండ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

హుస్నాబాద్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): శ్రీ చైతన్య వెల్డింగ్ అండ్ ఇంజనీరింగ్ వర్క్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షుడిగా ఎం.డి. పాషా, అధ్యక్షుడిగా పుల్లూరు విష్ణుమూర్తి, ఉపాధ్యక్షుడిగా ఎగ్గోజు సుదర్శనాచారి, కార్య దర్శిగా కందారపు రాజమౌళి,



కోశాధికారిగా పోలోజు శ్రీకాంతాచారి, ప్రచార కార్యదర్శిగా ఉప్పరపల్లి అనిల్ కుమార్ ఎంపికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా కాదాసు రాజు, దురిశెట్టి శ్రీనివాస్, ఎర్రబెల్లి కిషన్, వేమునూరి సంపత్, గొడుగు ప్రవీణ్ కుమార్, గంపల సతీష్ తదితరులు ఎన్నికయ్యారు.

# ఉపాధ్యాయిని హత్య దురదృష్టకరం ఎస్టియుటీఎస్

ఖానాపూర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్లూ రూపారెడ్డి హత్యను ఎస్టియుటీఎస్ నిర్మల్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది.జిల్లా అధ్యక్షుడు ఎస్. భూమన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మణ్ ప్రకటనలో మాట్లాడుతూ ఉపాధ్యాయులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేసే గురువులపై దాడులు జరగడం సమాజం తిరోగమన దిశలో పయనిస్తున్న సంకేతమని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల్లో గురువుల పట్ల గౌరవం, క్రమశిక్షణ, మానవీయ విలువలు పెంపొందించేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని కోరారు. ఉపాధ్యాయులకు భద్రత కల్పించి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఇంటర్ ఫెయిత్ కాన్ఫరెన్స్ నిర్వహణ



కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఈ నెల 22న కరీంనగర్‌లో ఇంటర్ ఫెయిత్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు మర్కజి మిలాద్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. రాజీవ్ చౌక్ వద్ద పీకాక్ రెస్టారెంట్‌లో జరగనున్న ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావును కమిటీ సభ్యులు ఆహ్వానించారు.మత సామరస్యం, సోదరభావం, శాంతి సందేశాన్ని చాటే అంశాలపై చర్చ జరగనుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆహ్వానం అందుకున్న రాజేందర్ రావు తప్పకుండా కార్యక్రమానికి హాజరవుతానని తెలిపారు.ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహణ



హుస్నాబాద్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పట్టణంలోని 14వ వార్డులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో సఫాయి అప్నా భీమారీ భగావో కార్యక్రమం నిర్వహించారు.చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా దండి లక్ష్మి మాట్లాడుతూ ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, నిల్వ నీటిని తొలగించి డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని హార్వెస్టింగ్ సిస్టమ్స్ ద్వారా వినియోగించుకోవాలని, చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు బురుగు లత, కొండ రజిత, తిరుపతి, బొలిశెట్టి రాజు, మంజుల, వరప్రసాద్, కేశవేని రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, బత్తుల స్వరూప, కో-ఆప్షన్ సభ్యులు సరోజన, గ్లోరినా, ప్రజా ప్రతినిధులు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవి కుమార్, జవాన్ సారయ్య, ప్రభాకర్, శ్రీకాంత్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మల్ మంచిర్యాల్ రహదారిపై ప్రమాదకరంగా మారిన వంగిన చెట్లు



**ఖానాపూర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నిర్మల్--మంచిర్యాల్ ప్రధాన రహదారిపై అటవీ శాఖ నిర్లక్ష్యం కారణంగా చెట్లు రోడ్డుకు ఇరువైపులా వంగి ప్రమాదకరంగా మారాయి. ఉడుంపూర్ అటవీ ప్రాంతం గుండా వెళ్లే ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది వాహనాలు, వేలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. ఖానాపూర్ కొమురం భీం చౌరస్తా నుండి సాయిబాబా ఆలయం వరకు చెట్లు రోడ్డుపై వంగి ఉండటంతో వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడు పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో తర్లపాడు, ఖానాపూర్, మంచిర్యాల్, లక్సటపేట ప్రాంతాల్లో చెట్లు విరిగిపడి వాహనాలపై పడిన ఘటనల్లో ప్రాణనష్టం జరిగినట్లు గుర్తుచేశారు.ఇకనైనా ఆర్ అండ్ బి, అటవీ శాఖ అధికారులు వంగిన చెట్లను తొలగించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**మానకొండూర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ వన్నారం గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ కార్డుల ద్వారా బియ్యం అక్రమ రవాణా, డీలర్ల అక్రమాలకు చెక్ పడుతుందని, ప్రతి అర్హుడికి సకాలంలో రేషన్ సరుకులు చేరుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి షర్మిల, అదనపు డైరెక్టర్ కిషన్ రెడ్డి, తహసీల్దార్ విజయ్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రతీరావు, సర్పంచ్ తాళ్లపల్లి సంపత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, మద్రి ఓదెలు యాదవ్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, రామిడి తిరుమల్ రెడ్డి, బండి మల్లేశం, కనకం కుమార్, శ్రీకాంత్, రేవెల్లి రాజలింగం, ఎడ్ల శ్రీధర్, పొలాడి రామారావు, చలిగంటి ఓదెలు, తాళ్లపల్లి కొమురయ్య, తాళ్లపల్లి తిరుపతి, బనుక తిరుపతి, బి. ఎల్లయ్య, పర్వయ్య, అనిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూ లక్ష్మి పథకం భూమిలేని కుటుంబాలకు భరోసా



**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ఎకరం భూమి అందజేస్తామని జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. అధ్యక్షురాలు కవితమ్మ ప్రవేశపెట్టిన భూ లక్ష్మి పథకం పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా రూపొందించబడిందని ఆయన పేర్కొన్నారు. భూమి ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవానికి ప్రతీక అని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఎకరం స్థలం ఇవ్వడం ద్వారా సమాజంలో సమానత్వం బలోపేతం అవుతుందని అన్నారు.భూమిపైన ప్రతి అర్హుడికి హక్కు కల్పించడమే నిజమైన సామాజిక న్యాయం, అదే తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితమ్మ లక్ష్యం అని హరిప్రసాద్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అంకం శివరాణి, రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్, బాసవేణి రాజేందర్, మడిపల్లి వినీత్, పూసాల రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలపై బీజేపీ భారీ ర్యాలీ



**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఫీజు బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి బీజేవైఎం ఆధ్వర్యంలో కరీంనగర్ నగరంలో బీజేపీ భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీకి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నాయకత్వం వహించారు. “ముఖ్యమంత్రి ఫీజు బకాయిలిస్తావా? లేక రాజీనామా చేస్తావా?” అంటూ నినాదాలు చేశారు.పదవ డివిజన్ కార్పొరేటర్ సొగాని కొమురయ్య, బీజేపీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి సీఐటీయూ



**ఖానాపూర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీడీ కార్మికులకు జీవనభృతి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 25న ఖానాపూర్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సిఐటియు ఆధ్వర్యంలోని తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ ప్రకటించింది.ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని, ప్రతి బీడీ కార్మికుడికి జీవనభృతి కల్పించాలని, కనీస పెన్షన్‌ను రూ.6,000కి పెంచాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మండల కన్వీనర్ మహమ్మద్ రియాసత్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, కార్యదర్శి నాగేల్లి నర్సయ్య, ఉపాధ్యక్షులు సుంచుల నారాయణ, పానగంటి నరేష్ కుమార్, నాగుల నర్సా గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బీడీ కార్మికులు అధిక సంఖ్యలో ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని సంఘం పిలుపునిచ్చింది.

## పెండింగ్ రైల్వే పనులు వేగవంతం చేయాలి ఎంపీ వంశీకృష్ణ



**పెద్దపల్లి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కీలక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గానికి మరిన్ని రైళ్లు కేటాయించడం, ముఖ్యమైన రైళ్లకు అదనపు స్టాపేజీలు కల్పించడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడం, రైల్వే మౌలిక వసతులను బలోపేతం చేయడం వంటి అంశాలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. పారిశ్రామిక, వాణిజ్య పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్దపల్లి నియోజకవర్గానికి రైల్వే కనెక్టివిటీని విస్తరించాల్సిన అవసరం ఉందని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు అనుగుణంగా సేవలను మెరుగుపరచాలని, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని కోరారు.ప్రజలకు మెరుగైన రైల్వే సౌకర్యాలు అందించడమే తన లక్ష్యమని, కేంద్ర రైల్వే శాఖ స్థాయిలో నిరంతరం కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు.ఎంపీ సూచించిన అంశాలపై రైల్వే ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో పలువురు ఎంపీలు, అధికారులు పాల్గొన్నారు.

## ఎబినేజర్ చర్చ్ ఆధ్వర్యంలో దోమతెరలు పంపిణీ



**నందికొట్కూరు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరు పట్టణంలోని మారుతీ నగర్, కర్నూల్ రోడ్ బైరెడ్డి నగర్ కాలనీలలో ఎబినేజర్ చర్చ్ ఆధ్వర్యంలో దాదాపు 100 కుటుంబాలకు ఉచితంగా దోమతెరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎబినేజర్ చర్చ్ వ్యవస్థాపకుడు బ్రదర్ జాకోబ్, సంఘ పెద్దలు జాన్సస్టాన్, చరణ్, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల తయారీపై చైర్మన్ పరిశీలన





**గంగాధర, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామంలో ఇందిరమ్మ చీరల తయారీని చేనేత జౌళి శాఖ కార్పొరేషన్ చైర్మన్ దూడం వెంకటరమణ పర్యవేక్షించారు. గ్రామానికి వచ్చిన ఆయనను వస్త్ర వ్యాపారులు శాలువాతో సత్కరించి పూల బుక్కే అందజేశారు.చైర్మన్ కార్ఖానాలను సందర్శించి సంచల మీద తయారు చేస్తున్న చీరలను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో పవర్ రూమ్స్, కార్మికుల సంఖ్య, యువకులు కొత్తగా ఆసక్తి చూపుతున్నారా అనే విషయాలను తెలుసుకున్నారు. తాను పద్మశాలి ముద్దుబిడ్డనని గర్వంగా పేర్కొన్నారు. వస్త్ర వ్యాపారులు గతంలో మిగిలిపోయిన బ్లూ కాటన్ చీరలను తీసుకునేలా చూడాలని, యారన్ సబ్సిడీ, కొత్తగా పెట్టుకున్న పింజర్లకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన వెంకటరమణ మిగిలిన బ్లూ కాటన్ చీరలను తీసుకునేలా, యారన్ సబ్సిడీ నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కొత్త వస్త్ర

## ప్రిన్సిపాల్ హత్యను ఖండించిన ప్రైవేట్ పాఠశాలలు



**గంగాధర, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి హత్యను గంగాధర మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు తీవ్రంగా ఖండించాయి. మధురానగర్‌లోని సురభి కాన్వెంట్ హై స్కూల్, విన్నర్ ఎడ్జి హై స్కూల్, గట్టుబుత్కూర్ శ్రీ సాయి విద్యానికేతన్, గర్షకుర్తి సరస్వతి హై స్కూల్, మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గురువులపై, విద్యాసంస్థల అధినేతలపై ఇలాంటి దాడులు జరగడం సమాజానికే సిగ్గుచేటని పేర్కొన్నారు.మైనర్ విద్యార్థులే ఈ ఘాతుకానికి పాల్పడటం విద్యా వ్యవస్థను దిగ్భ్రాంతికి గురిచేసిందని, విద్యార్థుల్లో నైతిక విలువలు లోపించడం ఎంతటి ప్రమాదకరమో ఈ ఘటన నిరూపిస్తోందని వక్తలు అన్నారు. విద్యా రంగ భద్రత కోసం ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గంగాధర మండల ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పాఠశాలల టీచర్లు, యాజమాన్యం పాల్గొన్నారు.

## ఆకర్షణలకు గురై మోసపోవద్దు ఆవుల సంపత్ యాదవ్




**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** డాక్టర్స్ స్ట్రీట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలలో మహిళా శిశు సంక్షేమ శాఖ--చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన సదస్సు జరిగింది.చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ బాలికలకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ మోసాలు, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాలికలు ఆకర్షణలకు గురై అపరిచితులను నమ్మి మోసపోవద్దని సూచించారు. స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. మత్తు పదార్థాలు చాక్లెట్లు వంటి రూపాల్లో కూడా పిల్లలను ఆకర్షించే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కేస్ వర్కర్ సుందరగిరి సాయికిరణ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉద్యోగుల గొంతుక పుస్తక ఆవిష్కరణ



**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ‘ఉద్యోగుల గొంతుక’ వార్షిక పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఐఏఎస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల కోసం టీఎన్జీవోలు నిర్వహించిన కార్యక్రమాలు, సమస్యలు, సందేహాలు--సమాధానాలు, అనుభవజ్ఞులైన ఉద్యోగులు, సంఘ నాయకుల సూచనలు, అనుభవాలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారికి ఉపయోగపడే సమాచారాన్ని అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఉద్యోగుల సంక్షేమంపై పలు అంశాలను చర్చిస్తూ, న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌లో మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెల్నెస్ సెంటర్లలో అనుభవజ్ఞులైన వైద్యులను అందుబాటులో ఉంచి ఉద్యోగులు, వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య చికిత్స అందేలా చూస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం లక్ష్మణరావు, కాళీచరణ్, అర్మీందర్ సింగ్, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి రాజు, అరవింద్ రెడ్డి, గంగారపు రమేష్, మామిడి రమేష్, పూర్ణచందర్ రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల పాఠశాలలో భరోసా సేవా కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జడల స్వప్న పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగుల (అంధుల) పాఠశాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సౌకర్యార్థం పోర్టబుల్ సిస్టమ్ స్పీకర్‌ను అందజేశారు.పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి దాతగా కుమార్తె జడల వర్షిణి సహకరించారు. సమాజానికి ఉపయోగపడే విధంగా వేడుకను నిర్వహించడం ద్వారా సేవా స్ఫూర్తిని చాటారని భరోసా సంస్థ అధ్యక్షుడు అక్కినపల్లి శివ జ్యోతి నాగరాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జడల స్వప్న, జడల వర్షిణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, ఉపాధ్యాయులు రమేష్, సరళ, ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. “మన ఆనందాన్ని నలుగురి ఆనందంగా మార్చడమే నిజమైన వేడుక” అనే సందేశంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు.

## రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**పెద్దపల్లి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పెద్దపల్లి జిల్లా రామగుండం జియం ఆఫీస్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. సాంకేతిక విప్లవానికి నాంది పలికి ఆధునిక భారత నిర్మాణానికి బలమైన పునాదులు వేసిన మహనీయుడి సేవలు చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు.పెద్దపల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, పట్టణ--మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయాలని డిమాండ్



**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లింగ్ పరిశ్రమకు సంబంధించిన బకాయిలను తక్షణమే వసూలు చేయాలని తెలంగాణ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి బకాయిపడిన సుమారు రూ.1,500 కోట్లను వెంటనే రైస్ మిల్లర్ల నుంచి వసూలు చేసి ఖజానాకు జమ చేయాలని ఆయన కోరారు. ప్రజల సొమ్ముకు సంబంధించిన బకాయిలను చెల్లించకుండా కాలయాపన చేస్తున్న మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రభుత్వానికి చెల్లించాల్సిన బియ్యం, ధాన్యం బకాయిలను అక్రమంగా దాచిపెట్టడం లేదా ప్రభుత్వానికి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. బకాయిల వసూలులో జాప్యం చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్ల వద్ద ఉన్న ప్రభుత్వ బకాయిలను గుర్తించి తక్షణమే వసూలు చేయాలని కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు.

## మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఘనంగా రక్తదాన శిబిరం



**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పద్మభూషణ్ డాక్టర్ చిరంజీవి జన్మదినం సందర్భంగా మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు.గాలిపెల్లి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వెలుపుల వెంకటేష్, మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ కసా రాజు, ఉత్తర కన్వీనర్ మిడి దొడ్డి కపిల్ మాధవ, జిల్లా అధ్యక్షుడు కోడూరి హరికృష్ణ ప్రారంభించారు. గత 16 సంవత్సరాలుగా మెగా బ్రదర్స్ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని, అభిమానులు ప్రతి ఏడాది రక్తదాన శిబిరాలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గాలి శ్రీనివాస్, సుల్తాన్, మురళి సహా పలువురు అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో తాటిపల్లి ప్రభు, ఫహద్, మామిండ్ల కిరణ్, వడ్లూరి శ్రీనివాస్, నాగరాజు, కరుణాకర్, మంథని సూరి, గాలి శ్రీను, విజయ్, వినయ్, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టపరిహారం ఇప్పించాలని రైతు వినతి



**పెద్దపల్లి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కాల్వశ్రీరాంపూర్ మండలం ఉప్పుటపల్లి గ్రామానికి చెందిన రైతు ముస్కు బుచ్చయ్య పంట నష్టపరిహారం కోసం అధికారులను ఆశ్రయించారు. డయాల్ సీడ్స్ కంపెనీ విత్తనాలతో సాగు చేసిన వరి పంట పూత దశలో పుప్పొడి రాకపోవడంతో దిగుబడి దెబ్బతింది. కంపెనీ ప్రతినిధులు ఎకరాకు రూ.75 వేల చొప్పున మొత్తం రూ.6 లక్షల పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు రూ.1.50 లక్షలు మాత్రమే అందించారని, మిగిలిన రూ.4.50 లక్షలు బకాయిగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పలుమార్లు అధికారులను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదని, కలెక్టర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. సుల్తానాబాద్ సీఐకి వినతిపత్రం ఇచ్చినా కేసు కాల్వశ్రీరాంపూర్ ఎస్సైకి బదిలీ చేసి అక్కడ కూడా పరిష్కారం జరగలేదని అన్నారు.ఇప్పటికైనా కలెక్టర్, పోలీసులు స్పందించి కంపెనీ ప్రతినిధులను పిలిపించి మిగిలిన రూ.4.50 లక్షల పరిహారం ఇప్పించాలని, భవిష్యత్తులో ఇతర రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కంపెనీపై చర్యలు తీసుకోవాలని బుచ్చయ్య డిమాండ్ చేశారు.

## ప్రమాద బాధిత కుటుంబానికి బీజేపీ నేత ఆర్థిక సహాయం



**పెద్దపల్లి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మూడు రోజుల క్రితం గంగా స్నానం ముగించుకుని వస్తుండగా బసంత్‌నగర్ రహదారిపై లారీ ఢీకొనడంతో చికురాయి గ్రామానికి చెందిన పినకాశి సతీష్, స్వప్న, విక్కి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల మనోహర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, చికిత్స ఖర్చుల కోసం రూ.50,000 ఆర్థిక సహాయం అందజేశారు.ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆర్థిక సహాయం అందించినందుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ కార్నివల్




**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వినూత్నంగా నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ కార్నివల్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి సరస్వతి మాత విగ్రహానికి పూజలు చేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రాండ్ పేరెంట్స్ ప్రేమ, ఆప్యాయత, జ్ఞానం కుటుంబానికి మార్గదర్శకమని, వారి సూచనలను ఆదర్శంగా తీసుకుని జీవితంలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గ్రాండ్ పేరెంట్స్ వినోదాత్మక ఆటలు, నృత్యాలు ప్రదర్శించి ఆనందాన్ని రెట్టింపు చేశారు. విద్యా సంస్థల అధినేతను సన్మానించి, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ వేడుకలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహణ



**రామడుగు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రంగనాథ శర్మ మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను పెంచడానికి ఎఫ్ఎల్ఎన్ పర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండెక్స్ ఉపయోగపడుతుందని, రెమిడీషన్ ప్రోగ్రామ్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ స్కూల్ సెల్ఫీ స్టాండ్ వినియోగించి బెస్ట్ ప్రాక్టీస్ ప్రగతిని ప్రదర్శించాలని, ఏ ఎక్సెల్ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు రవీందర్, శ్రీనివాస్, హరిప్రియతో పాటు విజిట్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు



**పెద్దపల్లి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఫోటో వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్ అధ్యక్షతన స్థానిక నందన గార్డెన్‌లో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేసి, అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి, రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయంతో 85 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి మాట్లాడుతూ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో జెండా ఆవిష్కరణ చేసి సంబరాలు నిర్వహించామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్ ఫోటోగ్రాఫర్ల ఐక్యతను ప్రస్తావిస్తూ, దినోత్సవాన్ని విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫోటోగ్రఫీ వృత్తిలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ఫోటోగ్రాఫర్లను, సీనియర్ ఫోటోగ్రాఫర్లను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లెర్ల ఉదయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఇర్ఫాన్, జిల్లా కోశాధికారి అల్లం సతీష్, మండల అధ్యక్షుడు వనపర్తి శ్రీనివాస్‌తో పాటు 200 మంది ఫోటో, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా జనగాం రాజ్‌కుమార్ నియామకం




**హుస్నాబాద్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అఖిల భారత యువజన సమాఖ్య సిద్దిపేట జిల్లా 4వ మహాసభలు హుస్నాబాద్‌లోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహాసభ అనంతరం జిల్లా అధ్యక్షుడిగా జనగాం రాజ్‌కుమార్, కార్యదర్శిగా కనుకుంట్ల శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనగాం రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో విద్య, వైద్యం, ఉపాధి హక్కుల కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని, యువత సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, సీపీఐ సీనియర్ నేత చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఈటీ నర్సింహా, జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్, మాజీ రాష్ట్ర నాయకులు జాగీర్ సత్యనారాయణ, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐవైఎఫ్ సభ్యులు, మీడియా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## కార్మిక హక్కుల పరిరక్షణకు సమరశీల పోరాటాలకు సిద్ధం కండి




**సుల్తానాబాద్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి జిల్లా ఏఐటీయూసీ నాలుగో మహాసభ సుల్తానాబాద్‌లో ఘనంగా జరిగింది. తొలుత ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి భారీ కార్మిక ప్రదర్శన యశోద నరహరి ఫంక్షన్ హాల్ వరకు సాగింది. అనంతరం అమరవీరులను స్మరించుతూ ఎర్రజెండా ఆవిష్కరించారు. మహాసభకు అధ్యక్ష వర్గంగా వై.వి. రావు, పూసల రమేష్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కలవేన శంకర్, బాలరాజు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం ద్వారా కేంద్ర ప్రభుత్వం హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని, ఉద్యోగ భద్రత, ఉపాధి హక్కులు, సంక్షేమ సౌకర్యాల కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ నివేదికను ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఆమోదించారు. మహాసభలో మారగోని ప్రవీణ్ కుమార్, తాండ్ర సదానందం, గౌతమ్ గోవర్ధన్, మార్కాపూర్ సూర్య, అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్, నాంసాని శంకర్, రెడ్డపాక లక్ష్మణ్, రాజరత్నం, ఎం.ఆర్.సి. రెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి
యజ్ఞ రాజయ్య బృందం విప్లవ అమరవీరుల పాటలు
ఆలపించి కార్మికుల్లో ఉత్సాహాన్ని నింపింది.

# నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎం



**పెద్దపల్లి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కల్లెపల్లి అశోక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, డీఎస్సీ, పోలీస్ తదితర నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి అమలు చేయాలని, వయోపరిమితి కోల్పోయిన అభ్యర్థులకు ప్రత్యేక సడలింపు ఇవ్వాలని, పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్, హాస్టల్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా రైల్వేలు, బ్యాంకులు, పోస్టల్, రక్షణ రంగం, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగ పరీక్షల్లో పేపర్ లీకేజీలు, అవకతవకలను అరికట్టి పారదర్శకత పాటించాలని, నిరుద్యోగుల సమస్యలపై శ్వేతపత్రం విడుదల చేయాలని అశోక్ కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే మరింత విస్తృతమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపెల్లి రవీందర్, జ్యోతి, ప్రశాంత్, శ్రావణ్, సందీప్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్, ఆదికృష్ణ, రాకేష్, సూరజ్, రాహుల్, లక్ష్మణ్, మారుతి, అభిలాష తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల చెయ్యాలని విద్యార్థుల ఆందోళన

**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో భారీ స్టూడెంట్ మార్చ్ జరిగింది. తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు వందలాది మంది కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద బీజేపీ లడాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాల విద్యార్థులకు చెల్లించాల్సిన రూ. 12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కాలేజీలకు బకాయిలు అందకపోవడంతో సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని, కొన్ని విద్యాసంస్థలు మూసివేత అంచున ఉన్నాయని తెలిపారు.







విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని, బకాయిలు విడుదల అయ్యే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ విద్యార్థులపై పోలీసులు అతిగా ప్రవర్తించారని, ప్రభుత్వానికి తొత్తులా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణ రావు, పార్లమెంటు కన్వీనర్ బొయినిపల్లి ప్రవీణ్ రావు, బీజేవైఎం నాయకులు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి, సంగ నరేష్, శశిధర్ రెడ్డి, చిక్కుల కిరణ్, ప్రమోద్, వెంకటేష్ గౌడ్, రమేష్ యాదవ్, బద్దం రాహుల్ రెడ్డి, వినయ్, మణిదీప్, నాగరాజు, సందీప్, శ్రీకర్, రాజేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ సన్నద్ధతకు ప్రత్యేక వెసులుబాటు ఇవ్వాలి



**కల్వకుర్తి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సెప్టెంబర్‌లో జరగనున్న 2026 ఇన్ సర్వీస్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ కు హాజరయ్యే ఉపాధ్యాయులకు పరీక్షా సన్నద్ధత కోసం ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని పీఆర్‌టీయూ తెలంగాణ నాగర్‌కర్నూల్ జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పలువురు ఎస్‌జీటీలు, లాంగ్వేజ్ పండిట్లు, స్కూల్ అసిస్టెంట్లు, వివిధ సబ్జెక్టులకు చెందిన ఉపాధ్యాయులు టెట్‌కు హాజరుకానున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సాయి రెడ్డి, గౌరవ అధ్యక్షుడు సమరసింహారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ శివరామకృష్ణ గౌడ్ తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ పాఠశాలల్లో బోధనా విధులు నిర్వర్తించడంతో పాటు పరీక్షకు సిద్ధం కావాల్సి వస్తోందని, దీంతో సమగ్ర సన్నద్ధతకు తగినంత సమయం లభించడం లేదని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల వృత్తి పురోగతికి టెట్ పరీక్ష కీలకమని, అందుకే ఆగస్టు 20 నుంచి పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రతిరోజూ పాఠశాల పని వేళలు ముగియడానికి రెండు గంటల ముందుగా విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు. ఈ సమయాన్ని ఉపాధ్యాయులు పరీక్షా సన్నద్ధతకు వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఇప్పటికే తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నందున, వారి వృత్తి అభివృద్ధికి ఉపయోగపడే టెట్ పరీక్ష విషయంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు సహకరించాలని పీఆర్‌టీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు రోజుకు రెండు గంటల ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తే వారు ఒత్తిడి లేకుండా మెరుగ్గా సిద్ధమై, మంచి ఫలితాలు సాధించగలరని
వారు అభిప్రాయపడ్డారు.

# పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర దారమోని గణేష్

**కల్వకుర్తి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలో బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్ మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97 పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమని ఆయన ఆరోపించారు. వేలాది మంది విద్యార్థులు సాంకేతిక విద్యలో నైపుణ్యం కోసం పాలిటెక్నిక్ కోర్సులు అభ్యసిస్తున్నారని, డిప్లమా పూర్తి చేసిన వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని గుర్తుచేశారు. అలాంటి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా +ూ 97 తీసుకురావడం విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తుందని గణేష్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర సాంకేతిక విద్యా పరిధిలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ వ్యవస్థను యూనివర్సిటీల పరిధిలోకి మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది క్రమంగా పాలిటెక్నిక్ కోర్సులను నిర్వీర్యం చేసే కుట్రేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించకుండా విద్యా వ్యవస్థనే దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పాలిటెక్నిక్



విద్యను యథావిధిగా కొనసాగించాలని, +ూ 97ను తక్షణమే రద్దు చేయాలని గణేష్ డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే, బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు కంఠం రవీందర్, విష్ణు, పెరుమాళ్ళ కృష్ణ, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**వంగూరు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం వంగూరు మండల కేంద్రం, పోల్కంపల్లి గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ పాఠశాల భవనాల నిర్మాణ పురోగతిని సమీక్షించి, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలను పరిశీలించడంతో పాటు, పనుల పూర్తికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ప్రభుత్వం ఆమోదించిన మ్యాప్, డిజైన్, నిర్మాణ ప్రణాళిక ప్రకారమే పనులు జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉపయోగించే మెటీరియల్ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, ప్రతి దశలోనూ క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తదుపరి పనులను చేపట్టాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి అయ్యేలా వేగం పెంచాలని, అయితే నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన మెరుగైన విద్యా వాతావరణం అందించడమే ఈ పాఠశాలల



నిర్మాణం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఈఓ రమేష్ కుమార్, ఇడబ్ల్యూడిసి ఇంజనీరింగ్ అధికారులు, వంగూరు తహసిల్దార్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి 34% రిజర్వేషన్



**నందికొట్కూరు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం బీసీ వర్గాలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించే కీలక అడుగని సామాజిక సేవకుడు గుజ్జుల గౌరీశ్వర నాయుడు అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజల సమస్యలపై ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న బీసీలకు స్థానిక పాలనలో తగిన స్థానం రావాలని, రిజర్వేషన్ ద్వారా వారి గొంతు పాలనా వ్యవస్థలో బలంగా వినిపిస్తుందని పేర్కొన్నారు. ఇది కేవలం ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం మాత్రమే కాకుండా సామాజిక మార్పుకు వేదిక కావాలని అన్నారు.రాజకీయ ప్రాతినిధ్యం పెరిగితే విద్య, ఉపాధి, వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం వంటి అంశాల్లో బీసీ వర్గాల అవసరాలు ప్రభుత్వ దృష్టికి మరింత బలంగా వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. రిజర్వేషన్‌తో పాటు నాయకత్వం కూడా పెరగాలని, ప్రజల కోసం పనిచేసే నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకులు ముందుకు రావాలని సూచించారు.మొత్తంగా బీసీల రాజకీయ ఎదుగుదల రాష్ట్ర అభివృద్ధికి బలం అవుతుందని, రిజర్వేషన్ ద్వారా వచ్చిన అవకాశాలు బీసీల జీవితాల్లో మార్పుకు దారితీయాలని గౌరీశ్వర నాయుడు అన్నారు.

## శ్రీశైలంలో నిర్వహించబడనున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



**శ్రీశైలం, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శ్రీశైలం దేవస్థానంలో ధార్మిక కార్యక్రమాల భాగంగా ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించబడుతున్నాయి. రేపు (21.08.2026) జరిగే వ్రతంలో 1500 మంది ముత్తైదువులకు అవకాశం కల్పించారు. వీటిలో 500 టోకెన్లు ఆన్‌లైన్‌లో, మిగిలినవి ప్రజాసంబంధాల విభాగం ద్వారా అందించారు.శ్రావణ మూడవ శుక్రవారం (28.08.2026), నాల్గవ శుక్రవారం (04.09.2026) కూడా వ్రతాలు నిర్వహించబడతాయి. మూడవ శుక్రవారం ప్రత్యేకంగా శివసేవకులకు అవకాశం కల్పించగా, నాల్గవ శుక్రవారం 750 చెంచు ముత్తైదువులు, 750 ఇతర భక్తులు పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రవతి కల్యాణ మండపంలో వ్రతాలు జరుగుతాయి. దేవస్థానం పూజాద్రవ్యాలన్నింటినీ సమకూ రు స్తూ, ప్రతి ముత్తైదువ కోసం వేర్వేరు కలశాలను నెలకొల్పి శాస్త్రోక్తంగా వ్రతం జరిపిస్తారు. వ్రతానంతరం పాల్గొన్న వారికి అమ్మవారి శేషవస్త్రాలుగా చీర, రవిక, పూలు, గాజులు, లడ్డు ప్రసాదం, పుస్తక ప్రసాదంగా శ్రీశైలప్రభ, వృక్ష ప్రసాదంగా తులసి, ఉసిరి మొక్కలు అందజేస్తారు. అదనంగా శ్రీస్వామి అమ్మవారి కైలాస కంకణాలు కూడా అందజే యబడ తాయి.ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహ ణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తులలో ధార్మిక చింతన పెంపొందించేందుకు ఈ వ్రతాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## దేశభక్తి అంటే పాలకుల భజన కాదు నేహా బోరా



**అమరావతి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఐసా అధ్యక్షురాలు నేహా బోరా తెలంగాణ పర్యటన సందర్భంగా హైదరాబాద్‌లో యువతతో సమావేశమై దేశభక్తి, ప్రజాస్వామ్యం, విద్యా రంగ సమస్యలపై మాట్లాడారు.ఆమె మాట్లాడుతూ దేశభక్తి అంటే పాలకులకు భజన చేయడం కాదని, ప్రభుత్వాల వైఫల్యాలను నిర్భయంగా ఎత్తిచూపడమే అసలైన దేశభక్తి అని స్పష్టం చేశారు. నోట్ల రద్దు, పౌరసత్వ చట్టం వంటి నిర్ణయాలు ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేశాయో ఉదాహరణగా చూపుతూ, పాలకుల తప్పులను ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని పేర్కొన్నారు.రోహిత్ వేముల ఆఖరి అక్షరాలు యువతకు నిత్య చైతన్య దీపమని, ఆయన కలలను సాకారం చేయడం తమ బాధ్యత అని అన్నారు. ఉమర్ ఖాలిద్, స్టాన్ స్వామి, జి.ఎన్. సాయిబాబా, వరవరరావు వంటి నాయకులు రాజ్యాంగ పరిరక్షణ కోసం చేసిన త్యాగాలను మరవకూడదని పిలుపునిచ్చారు.యువతకు మూడు సూత్రాలను సూచించారు -- ముందుగా చదువుకోండి, తరువాత సంఘటితంకండి, చివరగా పోరాటం చేయండి. ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసేలా గళం ఎత్తాలని పిలుపునిచ్చారు."ఈ దేశంలో నిజమైన లౌకిక ప్రజాస్వామ్యం పునరుద్ధరింపబడే వరకు, ప్రతి పేదబిడ్డకూ నాణ్యమైన ఉచిత విద్య అందే వరకు, ప్రతి యువకుడికి ఉపాధి అవకాశాలు దొరికే వరకు మా ప్రయాణం ఆగదు" అని నేహా బోరా గట్టిగా ప్రకటించారు. సమావేశం చివరగా "ఇంక్విలాబ్ జిందాబాద్ -- విద్యార్థి ఐక్యత వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు.

## దివ్యాంగుల సమస్యలపై మంత్రి అడ్లూరికి వినతి పత్రం



**హైదరాబాద్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇందిరా భవన్‌లో గురువారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దివ్యాంగుల సమస్యలను స్వయంగా విన్నారు.తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి సభ్యులు సమర్పించిన వినతిపత్రంలో పలు కీలక అంశాలు ప్రస్తావించారు. వికలాంగుల కమిషనర్ పదవికి వికలాంగులనే నియమించాలని, ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగ పురుషులకు ఉచిత పాస్‌లు ఇవ్వాలని, కొత్త పించన్లు మంజూరు చేసి నెలకు రూ.6000 అందించాలని, ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, బ్యాక్‌లాగ్ పోస్టుల నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని, అలాగే శాఖ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలని వారు కోరారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ ఈ వినతులను స్వీకరించి, "సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్, హైదరాబాద్ అధ్యక్షుడు పెద్దగొల్ల నాగరాజు, రాష్ట్ర మహిళా నాయకురాలు యశోద గోద పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో శ్రావణ ప్రత్యేక పూజలు



**ఎలిగేడు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రావణ మాసం రెండవ గురువారం సందర్భంగా ఎలిగేడు మండల కేంద్రంలోని శ్రీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుజిత్ కుమార్ ఆచార్యత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం అభిషేకం, అర్చన వంటి పూజాకార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య సాగాయి.తరువాత భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేయగా, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాధుని దర్శించుకున్నారు. శ్రావణ మాసపు ఆధ్యాత్మిక వాతావరణంలో ఆలయం భక్తుల సందడితో కళకళలాడింది.

## ప్రతిపాదించిన స్థలంలోనే పల్లె దవాఖాన నిర్మించాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి అవురుపల్లి గ్రామస్థుల వినతి**



**మాడ్గుల, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అవురుపల్లి గ్రామంలో పల్లె దవాఖాన నిర్మాణాన్ని గతంలో ప్రతిపాదించిన స్థలంలోనే చేపట్టాలని కోరుతూ గ్రామస్థులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామ సర్పంచ్ కిన్నెరి పెద్ద పోశయ్య ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన గ్రామస్థులు తమ సమస్యను వివరించారు.గత మూడేళ్ల క్రితం పల్లె దవాఖాన నిర్మాణానికి గ్రామపంచాయతీ కార్యాలయం వెనుక భాగంలోని స్థలాన్ని ప్రతిపాదించిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అదే స్థలంలో దవాఖాన నిర్మిస్తే గ్రామంలోని వృద్ధులు, చిన్నారులతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా నల్లవారిపల్లి, సింగంపల్లి, దొడ్లపాడు గ్రామాల ప్రజలకు కూడా ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందని తెలిపారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గతంలో ప్రతిపాదించిన స్థలంలోనే పల్లె దవాఖాన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. గ్రామస్థుల వినతిపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుడ్ల వెంకయ్య, బొడిగల యాదయ్య, డాక్టర్ విజయ భాస్కరరావు, చింతపల్లి రాములుగౌడ్, కేశమ శ్రీనివాస్‌గౌడ్, వట్టపు కిరణ్, కిన్నెరి మహేందర్, గుడ్ల ధనేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహంకాళి బోనాలు

**- పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు**
**- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు**



**ఇబ్రహీంపట్నం , ఆగస్టు 20 (నీలగిరీ ఎక్స్‌ప్రెస్) :** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి దేవాలయాలకు తరలివచ్చి బోనాలు సమర్పించారు. అమ్మవార్లకు ఆకర్షణీయమైన బోనాలు, శివసత్తున పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో పాటు బోనాలను అమ్మవారికి సమర్పించారు.

## సచివాలయంలో రైతు, భూ సమస్యలపై విస్తృత చర్చ



**హైదరాబాద్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, ఎం. భూమి సునీల్, ఎం. భవాని రెడ్డి గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయం ప్రిన్సిపల్ సెక్రటరీ వి. శేషాద్రి ఐఏఎస్ ను కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, భూ భారతి అమలు, రైతు సంక్షేమానికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. రైతులకు భూ హక్కులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవడం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సమర్థవంతంగా చేరేలా చూడడం, రైతు సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.కమిషన్ సభ్యులు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించగా, అధికారులు వాటిని అమలు చేయడానికి అవసరమైన మార్గాలను పరిశీలించారు.

## రమేష్ బాబు జన్మదినం సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**కల్వకుర్తి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుంది" అని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ జూలూరి రమేష్ బాబు అన్నారు. గురువారం వాసవి క్లబ్ కల్వకుర్తి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవి భవన్ లో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆపద సమయంలో రక్తం కోసం ఎంతోమంది ఎదురుచూస్తారని, కొన్నిసార్లు రక్తం దొరకక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు వస్తాయని, అందుకే రక్తదానం చేయడం అత్యంత గొప్ప సేవ అని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్మీచర్ల రమేష్ మాట్లాడుతూ, జూలూరి రమేష్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ శిబిరంలో 55 మంది రక్తదానం చేశారని, రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఐఈసీ ఆఫీసర్ కల్వ హరికృష్ణ, జోన్ చైర్మన్ బాదం రాఘవేందర్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ గుగ్గిల శంకర్, జూలూరి సత్యం, చిగుళ్లపల్లి శ్రీధర్, పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వాసా శేఖర్, వాసవి క్లబ్ అధ్యక్షుడు బాదం హరీష్, బాదం సాయి లక్ష్మి, కార్యదర్శి గోవింద్ సంతోష్, గోవిందు మౌనిక, మాచిపెద్ది రవికుమార్, మాచిపెద్ది కల్పన, వాసవి క్లబ్ సభ్యులు, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**కల్వకుర్తి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా నేతలు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, బ్లాక్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు కొల్లోజు రాజేష్ కుమార్, చిత్తరి శ్రీనివాస్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఏయాఖాన్, నాయకులు మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, వర్కలా భాస్కర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, సోఫి, వెంకట్ రెడ్డి, జమ్ముల శ్రీకాంత్, సంతూ యాదవ్, శివ, శివ ప్రసాద్, కృష్ణ రెడ్డి, కుమార్, బంగారయ్య, భాస్కర్, దున్న భాస్కర్, కుర్మయ్య, పడకంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జెడ్‌పి హెచ్ స్కూల్లో శక్తి యాప్ అవగాహన సదస్సు



**నందికొట్కూరు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచనలతో మల్యాల జెడ్‌పి హై స్కూల్లో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎశక్తి టీం ఏఎస్ఐ ఎస్. ఖాదర్ బాషా, పీసీ రసూల్ విద్యార్థులకు శక్తి యాప్, వాట్సాప్ నంబర్ 7993485111 అత్యవసర నంబర్లు 112,100 వినియోగంపై వివరించారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వంటి ఘటనలు జరిగితే వెంటనే హెడ్‌మాస్టర్ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు స్కూల్ పరిసరాల్లో కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని, తల్లిదండ్రుల మొబైల్‌లో శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేయాలని విద్యార్థులకు సూచించారు. అలాగే 181,1098,1930 టోల్‌ఫ్రీ నంబర్ల ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ సరోజినీ, ఉసెన్నమ్మ, ఉపాధ్యాయులు రవీంద్రనాథ్ గౌడ్, సర్వేశ్వర్ రెడ్డి, రెహమాన్, రామలక్ష్మయ్య, శ్రీనివాస శెట్టి, వాగ్దేవమ్మతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ను తనిఖీ చేసిన కలెక్టర్



**నంద్యాల, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్‌లో 24 గంటల నిరంతర నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా నంద్యాల మార్కెట్ యార్డ్ టెక్ గోడౌన్‌లో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, సీలింగ్, ఫైర్ సేఫ్టీ తదితరాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గోడౌన్ రిజిస్టర్‌లో సంతకం చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథన్, ఎలక్షన్ డీటీ మనోహర్, నంద్యాల తాసిల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహణ



**నందికొట్కూరు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై మణికంఠ గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వంటి ఉల్లంఘనలపై జిల్లా కలెక్టర్, డీఎస్పీ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రతి వాహనదారుడు పోలీస్ సూచనలు అనుసరించి గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవాలని, బాధ్యతతో ప్రయాణించి కుటుంబ జీవితం సుఖవంతంగా గడపాలని సూచించారు. తనిఖీల్లో వాహనదారులకు తగు సూచనలు, సలహాలు అందించారు.

## రాయలసీమ రైతులకు నీరందించాలి శిల్పా చక్రపాణి రెడ్డి



**నంద్యాల, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాయలసీమ రైతాంగానికి శ్రీశైలం ప్రాజెక్ట్ నుండి వెలుగోడు, గోరుకల్లు, అవుకు, మైలవరం రిజర్వాయర్లకు వెంటనే నీటిని విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.నంద్యాల పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించిన ఆయన, తాగునీరు--సాగునీటి అవసరాలపై కార్యాచరణ ప్రణాళికను చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 857 అడుగుల నీటి నిల్వలు ఉన్నప్పటికీ దిగువకు నీరు విడుదల చేయకపోవడం రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి పేరుతో రోజుకు 4 టీఎంసీల నీటిని తరలిస్తుండగా, ఏపీ ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎంతో చేసుకున్న ఒప్పందం వల్లే రాయలసీమకు నీటి కష్టాలు వచ్చాయని ఆయన ఆరోపించారు.రాయలసీమ ఎత్తిపోతల పథకం త్వరితగతిన పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి రాకపోయేదని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, శ్రీశైలం నుండి దిగువ రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రైతు నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, మొదటి విడతలో మంజూరైన ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆమె, గుడిసెల్లో నివసిస్తున్న 407 మందికి ఇప్పటికే ఇళ్లు మంజూరయ్యాయని, వారికి వెంటనే ప్రొసీడింగ్‌లు అందించి నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 1,500 ఇళ్లు మంజూరు చేయనున్న నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రతిపాదనలు వెంటనే పంపాలని ఎంపీడీవోలను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. అదేవిధంగా పైకప్పు మార్పిడి కోసం ప్రతి నియోజకవర్గం నుంచి 500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, ఒక్కొక్కరికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, గృహ నిర్మాణ శాఖ పీడీ గంగారం, ఎంపీడీవోలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## దేవస్థాన ఒప్పంద ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సహాయం



**శ్రీశైలం, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**:శ్రీశైలం దేవస్థానం అన్నప్రసాద వితరణ విభాగంలో ఒప్పంద పద్ధతిపై పనిచేసిన మండ్ల ఈదమ్మ అనారోగ్యంతో ఈ సంవత్సరం ఫిబ్రవరి 5న మరణించారు. వారి కుటుంబానికి ఆర్థిక సాయంగా దేవస్థానం ఒప్పంద, పొరుగుసేవల సిబ్బంది తమ నెలవారీ జీతం నుండి ఒకరోజు వేతనం మొత్తాన్ని సమకూర్చి రూ.2,45,763 చెక్కును అందజేశారు. ఈ చెక్కును మరణించిన ఉద్యోగి భర్త మల్లికార్జునకు కార్యనిర్వహణాధికారి చేతుల మీదుగా అందజేశారు.

## జర్నలిస్టుల సంక్షేమంపై అసెంబ్లీలో గళం విప్పిన గల్లా మాధవి



**అమరావతి, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అసెంబ్లీ వేదికగా జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించారు.ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రానిక్, ప్రింట్, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జి.ఓ నంబర్ 67, 107 ఆధారంగా జర్నలిస్టులకు హౌసింగ్ కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులకు నివాస వసతి కల్పించడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులు మరియు వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేలా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, వారి సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని గల్లా మాధవి అసెంబ్లీ వేదికగా గళం విప్పారు.

## ఎస్పీవై రెడ్డి ఆగ్రో ఇండస్ట్రీని పరిశీలించిన కలెక్టర్



**నంద్యాల, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా గురువారం ఎస్పీవై రెడ్డి ఆగ్రో ఇండస్ట్రీని సందర్శించి పరిశ్రమ కార్యకలాపాలు, ఉత్పత్తి ప్రక్రియ, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలను పరిశీలించారు.రెవెన్యూ, ఎక్సైజ్, పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్, లేబర్ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశ్రమలోని మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్, గ్రీనరీ, బై-ప్రొడక్ట్స్ నిర్వహణ, ప్రాసెసింగ్ యూనిట్ వంటి అంశాలను సమీక్షించారు.కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పరిశ్రమ కార్యకలాపాల వల్ల పర్యావరణానికి ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణ చర్యలను పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు.బై-ప్రొడక్ట్స్‌ను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహిస్తూ, వాటి వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరిశ్రమ పరిసరాల్లో గ్రీనరీ పెంచి పరిశుభ్రతను కొనసాగించాలని కలెక్టర్ రాజకుమారి గణియా స్పష్టం చేశారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**అచ్చంపేట, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా అచ్చంపేట పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్ మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ దేశానికి ఐటీ రంగాన్ని పరిచయం చేసిన మహానాయకుడని, యువతకు సాంకేతిక విప్లవాన్ని అందించి దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిన దూరదృష్టి నాయకుడని కొనియాడారు. ఆయన సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించిన మార్గదర్శి అని, కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇచ్చిన మహానాయకుడని పేర్కొన్నారు.ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీ కృష్ణ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ వేడుకల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, మాజీ ఎంపీపీ రామనాథం, రాష్ట్ర నాయకులు కుంద మల్లికార్జున్, జిల్లా కోశాధికారి కటకం రఘురాం, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖాదర్, మండల అధ్యక్షుడు బుచ్చి రాములు, శేఖర్ కపిలవాయి, గౌరీ హరిచంద్ర, రాంబాబు, శంకర్, ఐఎన్టియుసి అధ్యక్షుడు మహబూబ్ అలీ, రాష్ట్ర నాయకులు అప్ప శివ, కొండూరు శేఖర్, విష్ణు, గుజ్జుల రవీందర్, సుంకరి బాలరాజు, 20వ వార్డు ఇంచార్జ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## డీ-8 కెనాల్ పరిధిలో మంత్రి జూపల్లి పర్యటన



**కొల్లాపూర్, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన డీ-8 కెనాల్ పరిధిలోని కాల్వలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం స్వయంగా బైక్‌పై తిరుగుతూ పరిశీలించారు.తూడుకుర్తి దగ్గర ప్రధాన కాల్వ నుండి సాకర్‌పల్లి, ఏదుట్ల, గోపాలపేట, రేమద్దుల, సింగాయిపల్లి, తురకపల్లి, గోపులపురం వరకు కాల్వలను పరిశీలించి నీటి ప్రవాహం, కాల్వల పరిస్థితిని పర్యవేక్షించారు. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు విడుదల చేస్తున్న నీరు, ఆయకట్టు పరిస్థితిపై సాగునీటిపారుదల శాఖ అధికారులను మంత్రి ఆరా తీశారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టుకోవాలని మంత్రి సూచించారు. నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ అధిక విస్తీర్ణంలో పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల, నీటి ప్రవాహం, ఆయకట్టు పరిస్థితిపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. నీరు వృథా కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవడంతో పాటు, ఆయకట్టు చివరి భూములకు సైతం సక్రమంగా నీరు అందేలా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్, కోడేరు మాజీ ఎంపీపీ రామ్మోహన్ రావు, సాగునీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కారు--బైక్ ఢీ, వ్యక్తికి గాయాలు

**మర్రిగూడ, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**మర్రిగూడ మండలం నరసింపురం గేటు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేష్ అనే వ్యక్తి గాయపడ్డాడు. మునుగోడు మండలం చెల్లేడు గ్రామానికి చెందిన మహేష్ మాల్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది.స్థానికులు వెంటనే సమాచారమిచ్చి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో మాల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత మాజీ ప్రధానమంత్రి, దేశంలో సాంకేతిక విప్లవానికి పునాది వేసిన దివంగత రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణం హైదరాబాద్ రోడ్డులోని ఆయన విగ్రహానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా మేయర్ చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ పాత్ర ఎనలేనిదని, దేశంలో సమాచార--సాంకేతిక రంగాల విస్తరణకు ఆయన తీసుకున్న నిర్ణయాలే నేడు మన ఐటీ ప్రగతికి పునాదిగా నిలిచాయని అన్నారు. ఓటు హక్కు వయోపరిమితిని 18 సంవత్సరాలకు తగ్గించి యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించిన సంస్కర్తగా ఆయనను కొనియాడారు. స్థానిక సంస్థల బలోపేతానికి, పంచాయతీ రాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధత కల్పించడంలో ఆయన చేసిన కృషి మున్సిపల్ పాలనలో ఉన్న ప్రతి ఒక్కరికీ నిరంతర స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ ప్రగతి కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాల సాధనకు మనమంతా పునరంకితం కావాలని మేయర్ స్పష్టం చేశారు.

## రాజీవ్ ఆశయాలకు ఘన నివాళి

**- ఆధునిక భారత నిర్మాణానికి బాటలు వేసిన మహానేతకు స్మరణ**

**- ఆమనగల్లులో కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు**



**ఆమనగల్లు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆధునిక భారత నిర్మాణానికి బాటలు వేసి దేశ ప్రగతికి బలమైన పునాదులు వేసిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని ఆమనగల్లులో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశ ఆధునికీకరణ, యువత సాధికారతలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సాంకేతిక రంగ అభివృద్ధికి బాటలు వేస్తూ దేశ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసిన దార్శనిక నేతగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, సర్పంచ్ మండ్లి రాములు, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఆదివాసీ రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయక్, సీనియర్ నాయకులు ధనుంజయ, కొండల్ రెడ్డి, కాలే మల్లయ్య, ఖాదర్ ఖాద్రి, గాజుల శ్రీను, గాజుల సురేష్, పూసల సత్యం, అబ్దుల్ అలీమ్, కండె సాయి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, నాజర్, దేవరశెట్టి మహేష్, విజయ్ నాయక్, పూసల పరమేష్, సీత పెద్దయ్య, రహీం, పూసల వెంకటేష్, షఫీ, రఫీ, కుమార్ గౌడ్, రాఘవేందర్, శ్రీను నాయక్, అంజాత్, రవి, లక్ష్మణ్, సలీం, కిషన్ నాయక్, గుద్దేటి శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై మున్సిపాలిటీ దృష్టి

**- మూడో వార్డులో తండాల పర్యటన..**

**- సమస్యలు అడిగి తెలుసుకున్న చైర్మన్ పత్యనాయక్, వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి**



**ఆమనగల్లు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆమనగల్లు మున్సిపాలిటీ ప్రజలకు మరింత చేరువవుతోంది. 'ప్రజల వద్దకే మున్సిపాలిటీ' కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ మూడో వార్డులోని పలు తండాల్లో విస్తృతంగా పర్యటించి స్థానికుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గీత ఆచారి, మున్సిపాలిటీ మేనేజర్ ఆంజనేయులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి సాకీబండ ఎనకాడి తండా, వేములకుంట తండా, ఎర్రబిక్యా తండా, కట్యా తండా, ఊరబాయి తండా, నుచ్చుగుట్ట తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తండావాసులతో మాట్లాడి తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర సమస్యలపై ఆరా తీశారు. ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ పత్య నాయక్ మాట్లాడుతూ ప్రతి వార్డులో ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా మున్సిపల్ పాలనను మరింత ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు మున్సిపాలిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తండావాసులు, గ్రామ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై వరప్రసాద్‌కు ఘన వీడ్కోలు



**- బదిలీపై వెళ్తున్న ఎస్సైని సన్మానించిన సర్పంచ్ బొప్పిడి గోపాల్**

**ఆమనగల్లు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న వరప్రసాద్‌కు రావిచేడ్ సర్పంచ్, జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు బొప్పిడి గోపాల్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. నాయకులతో కలిసి వరప్రసాద్‌ను శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బొప్పిడి గోపాల్ మాట్లాడుతూ.. ఎస్సై వరప్రసాద్ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేవారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. బదిలీపై వెళ్తున్న వరప్రసాద్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయనకు కొత్త బాధ్యతల్లో విజయాలు చేకూరాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బందరి యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు రాములు, శ్రీశైలం యాదవ్, రామ స్వామి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు




**వెల్దండ, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరి కిషన్ నాయక్, నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు భూపతి రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో నేతలు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా హరి కిషన్ నాయక్ మాట్లాడుతూ, యువతకు ఐటీ రంగాన్ని పరిచయం చేసిన దూరదృష్టి నాయకుడు రాజీవ్ గాంధీ అని, భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని దేశాన్ని సాంకేతిక అభివృద్ధి దిశగా నడిపించిన ఘనత ఆయనదేనని కొనియాడారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ, వెంకటయ్య గౌడ్, ఉప సర్పంచ్ శీను, తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, గ్రామ వార్డు సభ్యులు గుద్ధటి కిష్టాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**దేవరకొండ ఆగష్టు 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్):**దేవరకొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో (మార్కెట్ ఆఫీస్) నందు ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. దేవరకొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మారుపాకుల సురేష్ గౌడ్,చందపేట మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొండేటి మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ దేవరకొండ మండల అధ్యక్షులు ముకురోజు రాజు,కౌన్సిలర్ హనుమంతు సాయి చంద్ర గౌడ్,యువజన కాంగ్రెస్ నాయకులు మెడ సైదయ్య, మూడవత్ సాగర్ నాయక్, ఉమర్ ఖాసీం,నేనావత్ మోతిలాల్,పులిజాల వెంకటయ్య, దుబ్బ చరణ్,కొర్ర కుమార్,పోతురాజు ధనరాజ్,కావటి లింగయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు, శంకర్ రావు నోముల యాదయ్య,కొమ్మనమోని విజయ్, రామకృష్ణ,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిండిలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**డిండి ఆగష్టు 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**డిండి మండల కేంద్రంలో ని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నవభారత నిర్మాత భారతరత్న పురస్కార గ్రహిత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిబి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. వృద్దులకు పండ్లు, బ్రెడ్లు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు ,డిండి మండల కాంగ్రెస్ అధ్యక్షులుముత్యాల శశిధర్ రెడ్డి ,డిండి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డమీది సాయి,మరియు ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్.సి.సి నూతనక్యాడెట్ల ఎంపిక

**దేవరకొండ ఆగష్టు 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండలో ఎన్ సి సి విభాగం ఆధ్వర్యంలో " 2026-27 విద్యా సంవత్సర విద్యార్థులకు ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామావత్ రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నల్గొండ 31 బెటాలియన్ పి ఐ స్టాప్ విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్ మరియు మెడికల్ టెస్ట్ తో పాటు రిటర్న్ టెస్ట్ ఎగ్జామ్ నిర్వహించి మొత్తం ప్రథమ సంవత్సర క్యాడెడ్స్ ని 22 మందిని ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మరియు ఎన్సిసి సిటిఓ జి కోటయ్య,సుబేదార్ కొమ్ము మల్లయ్య, హవల్దార్ మల్కప్ప కట్టి, అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి. లింగారెడ్డి, డాక్టర్.రేణుక, శివకృష్ణ, మధు, తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు ఎన్.సి .సి క్యాడెట్లు పాల్గొన్నారు.

## మర్రిగూడలో పి హెచ్ సి నిర్మాణానికి భూమి పూజ



**మర్రిగూడ, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**మర్రిగూడ మండల కేంద్రంలోని దామెర బీమనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 20 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించబోయే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ సి) భవనానికి గురువారం భూమి పూజ జరిగింది.గ్రామ సర్పంచ్ జిల్లా అలివేలు కృష్ణ భూమి పూజ నిర్వహిస్తూ, గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఈ ఆసుపత్రి భవనం నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొడాలి వెంకటరెడ్డి, ఆదివాసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమావత్ శీను నాయక్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**మర్రిగూడ, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు మర్రిగూడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ నేతృత్వంలో బస్‌స్టాండ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను, యువతకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యతను, ఆధునిక భారత నిర్మాణానికి చేసిన కృషిని స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గ్రామ శాఖ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
శుక్రవారం,
ఆగస్టు 21, 2026



# కళా ఉద్యమ సారథి కామ్రేడ్ కారుపోతుల అంజన్నకు ఘన నివాళి



**నల్లగొండ, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజానాట్యమండలి కళా ఉద్యమ సారథి కామ్రేడ్ కారుపోతుల అంజన్న 31వ వర్ధంతి సందర్భంగా నల్లగొండ దొడ్డి కొమరయ్య భవన్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి మాజీ రాష్ట్ర నాయకులు పాలడుగు నాగార్జున, జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్ మాట్లాడుతూ, సాక్షరత ఉద్యమంలో అంజన్న సుమారు ఐదు వేల మంది కళాకారులను సమీకరించి వారికి శిక్షణ ఇచ్చి, వేలాది మందికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన పేద ప్రజలను పాటలు, పల్లె సుద్దులు, ప్రజా కళారూపాల ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. అంజన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రజానాట్యమండలి అధ్యక్షుడిగా పనిచేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా, ఢిల్లీ, మద్రాస్ వంటి నగరాల్లో పల్లె సుద్దులు ప్రదర్శించి ప్రజల ఆదరణ పొందారని, ఆయన పాటలు, కళారూపాలు ఇప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచాయని నాయకులు గుర్తుచేశారు. ప్రస్తుతం యువతపై విదేశీ విష సంస్కృతి, సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా సమస్యల పట్ల చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉందని, "కళ కళ కోసం కాదు... ప్రజల కోసం" అనే నినాదంతో ప్రజానాట్యమండలి ముందుకు సాగుతోందని వారు స్పష్టం చేశారు. నేటి కళాకారులు అంజన్నను ఆదర్శంగా తీసుకుని ప్రజా కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ హషాం, గంజి మురళి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరేష్, శంకర్, స భ్యులు పల్లె ప్రసాద్, మాద సైదులు, చిలుకూరు బిక్షం, పుట్టల సైదులు, మలుకూరి శ్రీశైలం, చింతల విజయ, మేడి అంజమ్మ, కమిటీ సభ్యులు జిట్ట స్వామి, పగిలే యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# 84 అవార్డులు సాధించడం గర్వకారణం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**నల్లగొండ, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఫోటోగ్రఫీ వృత్తిలో సుదీర్ఘకాలంగా విశేష ప్రతిభ కనబరుస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయిలో 84 అవార్డులు సాధించడం గర్వకారణమని రాష్ట్ర రోడ్లు--భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నిర్వహించిన పోటీల్లో రెండు అవార్డులు సాధించిన సాక్షి సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కంది భజరంగ్ ప్రసాద్ను గురువారం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఫోటోగ్రఫీని వృత్తిగా ఎంచుకుని సమాజంలోని అనేక ముఖ్యమైన సంఘటనలను కెమెరా ద్వారా ప్రజల ముందుకు తీసుకువచ్చిన భజరంగ్ ప్రసాద్ సేవలు అభినందనీయమని అన్నారు. ఫోటోగ్రఫీ రంగంలో కొనసాగుతూ 84 అవార్డులు సాధించడం ఆయన ప్రతిభకు, అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఒక మంచి ఫోటో ఒక సంఘటనను మాత్రమే కాకుండా, ఆ కాలాన్ని, సమాజ పరిస్థితులను భవిష్యత్ తరాలకు గుర్తుండేలా చేస్తుందని మంత్రి అన్నారు. ఫోటో జర్నలిస్టులు ఎదుర్కొనే సవాళ్లను అధిగమిస్తూ నిబద్ధతతో పనిచేస్తున్న భజరంగ్ ప్రసాద్‌ను అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని అవార్డులు సాధించి నల్లగొండ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహించిన పోటీల్లో రెండు అవార్డులు సాధించడం పట్ల మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, కార్పొరేటర్లు అల్లి సుభాష్, కేసాని వేణుగోపాల్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, నాయకులు వంగాల అనిల్ రెడ్డి, అల్లి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి అభివృద్ధిపై ఎమ్మెల్యే ఫోకస్

**– ఇందిరమ్మ ఇళ్లు, రహదారుల పనులపై అధికారులతో సుదీర్ఘ సమీక్ష.. జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశం**



**ఆమనగల్లు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో హౌసింగ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ట్రైబల్ పంచాయతీరాజ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ అభివృద్ధిపై సవివరంగా చర్చించారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, తొలి విడతలో మంజూరైన గృహాల పరిస్థితి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, రెండో విడతలో మంజూరు చేయాల్సిన ఇళ్ల అంశాలను సమీక్షించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రహదారి పనులు, కొత్త రోడ్ల ప్రతిపాదనలు, బీటీ రోడ్ల నిర్మాణం, ఇప్పటికే మంజూరైన పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రహదారుల పనులకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవోలు జయరాం, గీత, సీత, శంకర్ నాయక్, విజయలక్ష్మి, సులోచన, సుజాత, మున్సిపల్ కమిషనర్లు రాఘవేందర్, షేక్ మొహమ్మద్, పంచాయతీరాజ్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, బసవలింగం, ఏఈలు, హౌసింగ్ ఏఈలు, డీలర్లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గదర్శకం

**– బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహానేత రాజీవ్ గాంధీ**



**ఆమనగల్లు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని కడ్తాల్ మండల కేంద్రంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోతుగంటి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హన్మ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు పోతుగంటి శంకర్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ప్రధానిగా దేశాభివృద్ధితో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. దేశాన్ని ఆధునిక సాంకేతిక, సమాచార రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని అన్నారు. దేశం కోసం చివరి శ్వాస వరకు అవిశ్రాంతంగా శ్రమించిన రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నిరుపేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన కృషి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ఆయన అడుగుజాడల్లో నడవాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కడ్తాల్ పట్టణ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉప సర్పంచ్ యాదగిరి రెడ్డి, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బిఖ్యా నాయక్, పట్టణ అధ్యక్షుడు మాలే మల్లేష్ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జాంగీర్ బాబా, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్, వార్డు సభ్యుడు భానుకిరణ్, నాయకులు సత్యం యాదవ్, రామచందర్ నాయక్, చెందోజి, కర్రోళ్ల రమేష్, అనిల్ యాదవ్, భరత్ యాదవ్, శివ నాయక్, శ్రీను, మహేష్, రమేష్, కుమార్, లక్ష్మణ్, సేవ్యా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అండగా.. ఫర్నిచర్ పంపిణీ

**– కోరింతకుంట తండా పాఠశాలకు టేబుళ్లు, కుర్చీలు, గ్రీన్ బోర్డు అందజేసిన ఉన్నతి, శిక్ష ఫౌండేషన్**



**ఆమనగల్లు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఉన్నతి, శిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా తలకొండపల్లి మండలం కోరింతకుంట తండా ప్రభుత్వ పాఠశాలకు టేబుళ్లు, కుర్చీలు, గ్రీన్ బోర్డు తదితర సామగ్రిని గురువారం ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి భావి పౌరులని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తే విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. పాఠశాలకు టేబుళ్లు, కుర్చీలు, గ్రీన్ బోర్డు తదితర సామగ్రిని అందించిన ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డికి గ్రామ సర్పంచ్ మూడవత్ రవీందర్, వార్డు సభ్యుడు బాలునాయక్, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ బండి రఘుపతి, సభ్యులు వంకురి శ్రీరామ్, ఇంజమూరి యాదగిరి, రమేష్ నాయక్, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలి

**– చెన్నకేశవ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ పాండు ఆకస్మిక తనిఖీ**



**ఆమనగల్లు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడంతో పాటు పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి పాండు సూచించారు. మంగళపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నకేశవ కాలనీ ప్రభుత్వ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించి పాఠశాలలో విద్యాబోధన, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా బోధనా విధానాలను అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందేలా చూడాలని అన్నారు. పాఠశాల పరిసరాలు, ఆటస్థలాన్ని పరిశీలించిన ఎంఈఓ.. చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యతో పాటు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తలారి శ్రీను, ఏలే ఉమామహేశ్వరి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు అనిత, విద్యార్థులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు పెట్టుబడులే లక్ష్యంగా సీఎం విదేశీ పర్యటన

**– ఢిల్లీ విమానాశ్రయంలో సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ మల్లు రవి ఘన వీడ్కోలు**



**ఆమనగల్లు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, భారీ పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేపట్టిన యూకే, యూఎస్ఏ విదేశీ పర్యటన ప్రారంభమైంది. గురువారం ఢిల్లీ విమానాశ్రయం నుంచి విదేశీ పర్యటనకు బయలుదేరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి, తెలంగాణ ప్రభుత్వ ప్రోటోకాల్, ప్రజా సంబంధాల సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. యూకే, యూఎస్ఏ పర్యటన ద్వారా తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలు తీసుకురావాలని మల్లు రవి కోరారు. రాష్ట్ర ప్రగతికి విదేశీ పెట్టుబడులు కీలకమని, తెలంగాణను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా మరింత బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి పర్యటన ఫలప్రదం కావాలని ఆకాంక్షించారు.

# సేవా కార్యక్రమాలతో దశరథ్ నాయక్ జన్మదిన వేడుకలు

**– ఆలయాల అభివృద్ధికి రూ.12 లక్షల విరాళం**



**ఆమనగల్లు, ఆగస్టు 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు దూరంగా నిర్వహిస్తూ సమాజ సేవకు అంకితం చేసిన కడ్తాల్ మాజీ జడ్పీటీసీ, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని కడ్తాల్ మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనుల కోసం రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.12 లక్షల విరాళాన్ని అందజేశారు. దివంగత తన కుమారుడు రాధాకృష్ణ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా అందించిన విరాళాన్ని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేతుల మీదుగా ఆలయాల ప్రతినిధులకు అందించారు. ఆలయాల మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్, ఇతర ఆడంబరాలకు బదులుగా ఆలయాల అభివృద్ధికి భారీగా విరాళం అందించడం పట్ల నియోజకవర్గ ప్రజలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. జన్మదిన వేడుకలకు కడ్తాల్ మండల కేంద్రానికి అభిమానులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దశరథ్ నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తదితరులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. దశరథ్ నాయక్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు, మాజీ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ వైస్ ఎంపీపీలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉపసర్పంచులు, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మ్యూజికల్ డ్రామా..జగమే సంగీతం

### అమెజాన్‌లో 4నుంచి వెబ్ సీరిస్




టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ ప్రపంచవ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. కర్ణాటక సంగీత నేపథ్యంతో రూపొందిన ఈ ఒరిజినల్ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రసారం కానుంది. ప్రముఖ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌ను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ఎ.ఆర్. ప్రభావ్ ఈ సిరీస్‌కు కథను అందించగా, విశాల్ చంద్రశేఖర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కర్ణాటక సంగీత సంప్రదాయాలను సమకాలీన శ్రుతులతో మేళవిస్తూ ఆయన అందించిన స్వరాలు ఈ కథకు ప్రాణం పోశాయని చెప్పవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో తెలుగుతో పాటు తమిళ డబ్బింగ్ వెర్షన్, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది.ఈ కథ విషయానికొస్తే.. కర్ణాటక సంగీత వారసత్వాన్ని కలిగిన కుటుంబం మరియు దాని మూలాల చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. తన తాత గారి సంగీత వారసత్వాన్ని కొనసాగించాలనుకునే బాలు అనే యువకుడు.. కుటుంబ బంధాలు, రహస్యాలు, సాంప్రదాయ కట్టుబాట్ల మధ్య ఎలా నలిగిపోయాడనేదే ప్రధానాంశం. తన కుటుంబం నిర్మించిన ప్రతిష్టను కాపాడుకుంటూనే, తనకంటూ ప్రత్యేకమైన కళాత్మక స్వరాన్ని ఎలా కనుగొన్నాడనే భావోద్వేగ ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు. సంగీతంలోని భావోద్వేగ శక్తిని చాటిచెప్పే హృద్యమైన కథే 'జగమే సంగీతం' అని, సంప్రదాయం, ఆశయం వంటి అంశాలను ఇది అద్భుతంగా అన్వేషిస్తుందని తెలిపారు. అలాగే నిర్మాత సుష్మిత కొణిదెల మాట్లాడుతూ.. సంగీతం కేవలం ఒక కళ మాత్రమే కాకుండా, ఆ కుటుంబంలోని ప్రేమ, సంఘర్షణలను తెలిపే భావోద్వేగ భాషగా ఎలా మారుతుందో ఈ సిరీస్ ద్వారా చూపిస్తున్నామని పేర్కొన్నారు. అసాధారణ నటీనటులతో తెరకెక్కిన ఈ సంగీత భరిత ప్రయాణాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆస్వాదిస్తారని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

## 90 ఏళ్ల ఘనమైన నట వారసత్వం మాది




భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. ఈ సందర్భంగా నాగార్జునతో పాటు అతడి కుమారులు వారి సినీ ప్రయాణం, కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అక్కినేని కుటుంబం నుంచి తొమ్మిది దశాబ్దాల సినిమా చరిత్ర కొనసాగుతుండటం పట్ల టాలీవుడ్ కింగ్ నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. లెగసీ అంటే కేవలం నటులుగా ఉండటం కాదని, మొత్తం సినిమా రంగానికే సేవ చేయడమని ఆయన స్పష్టం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు అడుగుజాడల్లో తాను ప్రయాణించానని, ఇప్పుడు తన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా అదే బాటలో నడుస్తున్నారని తెలిపారు. సృజనాత్మక రంగంలో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో చెబుతూ, షూటింగ్ సెట్స్‌లో ఎవరికోసం ఎప్పుడూ ఇబ్బంది కలిగించకూడదనే తన సిద్ధాంతాన్ని గుర్తుచేసుకున్నారు. 'శివ', 'గీతాంజలి' వంటి సాహసోపేతమైన చిత్రాలతో తాను ఎలా కొత్త మార్గాన్ని ఎంచుకున్నానో, అదే రీతిలో కుమారులు కూడా సొంత గుర్తింపు తెచ్చుకోవాలని నాగార్జున ఆకాంక్షించారు. నాగచైతన్య మాట్లాడుతూ.. దాదాపు 90 ఏళ్ల సినిమా ప్రయాణం కాలాతీతమైనదని, తాత నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చైతూ తెలిపారు. సినిమా పరిశ్రమలోకి వచ్చిన మొదట్లో తనకంటూ ఒక స్టైల్ వెతుక్కునే క్రమంలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నానని, అయితే కాలక్రమేణా సినిమాపై ఉన్న ఇష్టంతో ఆ సవాళ్లను అధిగమించానని చెప్పారు. అక్కినేని కుటుంబం అందించిన లెగసీని కాపాడుకోవడం తమ బాధ్యత అని యంగ్ హీరో అఖిల్ అక్కినేని పేర్కొన్నారు. తమ కుటుంబం నుంచి వచ్చిన వారసత్వాన్ని 'బంగారు బ్యాటన్'తో పోల్చిన ఆయన, దానిని మరింత ముందుకు తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తాత ఇచ్చిన వారసత్వాన్ని ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటామని అఖిల్ భావోద్వేగంగా పంచుకున్నారు.



## తల్లిదండ్రుల మధ్య సేదదీరిన విజయ్ దేవరకొండ

### ఫోటోను షేర్ చేసిన రష్మిక మందన్నా

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన కుటుంబంతో గడిపిన మధురమైన క్షణాలకు సంబంధించిన ఒక క్యూట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా విజయ్ తాజా సినిమా షూటింగ్ అనూహ్యంగా రద్దు కాగా, ఆ సమయాన్ని ఆయన పూర్తిగా తన కుటుంబంతో కలిసి విశ్రాంతిగా గడపాలని నిర్ణయించుకున్నారు. చిన్నతనంలో తాను ఎంతో ఇష్టపడే ప్రదేశంలో, తన తల్లిదండ్రుల మధ్య హాయిగా నిద్రపోతున్న ఒక అరుదైన ఫోటోను ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ పిక్‌కు విజయ్ క్యాప్షన్ ఇస్తూ, వర్షం కారణంగా షూటింగ్ రద్దయిందని, చిన్ననాటి ఇష్టమైన ప్రదేశంలో మధ్యాహ్నం పూట ఇలా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల తన ఎనర్జీ రీఛార్జ్ అయిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ అందమైన ఫోటోను తన సతీమణి, ప్రముఖ నటి రష్మిక మందన్న తీశారంటూ ఆమెకు ప్రత్యేకంగా క్రెడిట్ ఇవ్వడం విశేషం. ఈ దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్, రష్మిక జోడీ ఆన్ స్క్రీన్‌పై కూడా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ డ్రామా 'రణబాలి' చిత్రంలో ఈ రియల్ లైఫ్ కపుల్ ఆన్ స్క్రీన్‌పై జంటగా నటిస్తున్నారు.

----------------

## రంభ ఊర్వశి మేనక నుంచి మరో పాట విడుదల





'రంభ ఊర్వశి మేనక' అంటూ అల్లరి చేయడానికి సిద్ధమయ్యారు అల్లరి నరేశ్. ఆయన ప్రధానపాత్రలో తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇందులోని రెండో పాటను విడుదల చేశారు. 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా' అంటూ సాగే ఈ పాటలో వెల్లవే పేదరికం.. ఇక్కడే
ఇల్లరికం అనే లిరిక్స్ నేపథ్యానికి తగినట్లుగా ఉన్నాయి. చంద్రమోహన్ చింతా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నరేశ్‌కు జోడీగా సురభి నటించారు.

## రామ్ చరణ్ అన్నతో సినిమా చేయాలని ఉంది : వరుణ్ తేజ్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన సోదరుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి వెండితెరను పంచుకోవాలన్న తన ఆకాంక్షను వెల్లడించారు. ఇటీవల 'కొరియన్ కనకరాజు' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆయన, ఆ సంతోషాన్ని పంచుకుంటూ తన కెరీర్, భవిష్యత్ ప్రాజెక్టులకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.గత ఐదేళ్లుగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో కొంత ఒత్తిడికి లోనయ్యానని, అయితే 'కొరియన్ కనకరాజు' చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన ఆదరణతో ఇప్పుడు ఎంతో ఊరటగా ఉందని వరుణ్ పేర్కొన్నారు. కేవలం ఒకే తరహా జోనర్‌లకు పరిమితం కావడం తనకు ఇష్టం ఉండదని, నటుడన్నవాడు ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయాలని తాను నమ్ముతానని చెప్పారు. కరోనా అనంతర కాలంలో ఓటీటీ ప్రాధాన్యత పెరిగినప్పటికీ, థియేటర్‌లకు వచ్చే ప్రేక్షకులకు ఒత్తిడిని దూరం చేసేలా స్వచ్ఛమైన వినోదాన్ని అందించడం ఎంతో కీలకమని తాను గ్రహించినట్లు వివరించారు.త్వరలో విడుదల కానున్న స్పోర్ట్స్ డ్రామా 'బరి' గురించి ప్రస్తావిస్తూ, గతంలో తాను చేసిన 'గని' చిత్రంలో అనేక అంశాలను జోడించడం వల్ల కొంత గందరగోళం ఏర్పడిందని, అయితే 'బరి' మాత్రం పూర్తి క్రీడా నేపథ్యంతో ఎంతో వాస్తవికంగా ఉంటుందని వరుణ్ తేజ్ భరోసా ఇచ్చారు. ఈ చిత్ర ఆలోచన తన సోదరి నిహారిక నుంచి వచ్చిందని తెలిపారు. దీనితో పాటు, ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఒక రొమాంటిక్ చిత్రానికి అంగీకరించానని, తన వయసుకు తగినట్లుగా ఉండే ఈ ప్రేమకథ విభిన్న శైలిలో ఉంటుందని వెల్లడించారు.రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ, "చరణ్ అన్నయ్య అగ్ర కథానాయకుడు. తన సినిమాల కోసం ఆయన పడే శ్రమను చూసి నేను ఎంతో స్ఫూర్తి పొందుతుంటాను. చరణ్ అన్నతో కలిసి ఒక సినిమా చేయాలన్నది నా కోరిక" అని తన మనసులోని మాటను బయటపెట్టారు. తాను చిత్ర పరిశ్రమలోకి దర్శకుడు కావాలనే లక్ష్యంతో అడుగుపెట్టానని, భవిష్యత్తులో ఆ దిశగా తప్పకుండా అడుగులు వేస్తానని వరుణ్ తేజ్ స్పష్టం చేశారు.

## మమితా బైజు .. మరో మూవీతో సిద్ధం



'ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.

## వెంకటేశ్-కల్యాణ్‌రామ్ కొత్త సినిమా టైటిల్ ఇదే..

విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న సినిమాకు టైటిల్ ఖరారైంది. ఇంతవరకు #VenkyAnil5, #NKRAR2 పేర్లతో ప్రచారంలో ఉన్న ఈ చిత్రానికి 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. షైన్ స్క్రీన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను ప్రత్యేక వీడియో ద్వారా ప్రకటించారు. ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు నివాళిగా 'అప్పుల అప్పారావు'లోని ఓ హాస్య సన్నివేశాన్ని గుర్తు చేస్తూ వీడియోను మొదలుపెట్టారు. ఈవీవీ సత్యనారాయణ తనకు స్ఫూర్తి అని అనిల్ రావిపూడి పలు సందర్భాల్లో చెప్పిన విషయం తెలిసిందే.వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతిశెట్టి కలిసి అనిల్ రావిపూడిని సినిమా టైటిల్ ఏంటని అడుగుతారు. అందుకు ఆయన ఎలాంటి తడబాటు లేకుండా 'జనవరి 12 విడుదల' అని చెబుతారు. దీంతో నటీనటులు కాసేపు అయోమయానికి గురవుతారు.

తాము విడుదల తేదీ గురించి కాదు.. టైటిల్ గురించి అడిగామని చెబుతారు. చివరికి అదే సినిమా టైటిల్ అని అనిల్ వెల్లడించడంతో వీడియో ముగుస్తుంది.కొద్ది రోజుల క్రితం వెంకటేశ్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. సినీ పరిశ్రమలో ఆయన 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ పోస్టర్‌ను తీసుకొచ్చారు. ఇందులో లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్‌రెడ్డిగా వెంకటేశ్ కనిపించారు.భారత సైన్యంలో పనిచేసే ఈ అధికారి కౌంటర్ టెర్రరిజం, బందీలను రక్షించే కార్యకలాపాల్లో నిపుణుడిగా ఉంటారని పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఆర్మీ దుస్తుల్లో, సన్‌గ్లాసెస్‌తో, ఓ కారు పక్కన వెంకటేశ్ కనిపించిన తీరు ఆకట్టుకుంది.వెంకటేశ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్‌కు కృతిశెట్టి జంటగా కనిపించనున్నారు. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌తో పాటు అనిల్ రావిపూడి మార్క్ వినోదం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.సాహు గారపాటి షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. సమీర్‌రెడ్డి కెమెరామెన్, తమ్మిరాజు ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు.

